నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
బుధవారం | 07 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

కల్తీ విత్తనాల అమ్మితే కఠిన చర్యలు



నవతెలంగాణ-హత్నూర

కల్తీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జోగిపేట్ ఏడీఏ అరుణ హెచ్చరించారు. హత్నూర మండలంలోని దౌల్తాబాద్ కాసాలలో గల ఎరువుల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎరువుల దుకాణాదారులకు సూచించారు. ప్రతీ రైతు ఆధార్ కార్డు ఎంట్రీ చేసుకొని ఎరువులను పంపిణీ చేయాలన్నారు. అలాగే రైతులతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోలో భద్రతా మాసోత్సవాలు



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోలో ప్రమాద రహిత డ్రైవర్లను మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంవిఐ కవిత, డిప్యూటీ ఆర్ఎం దైవాదినం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. ప్రతీ ఒక్కరూ డ్యూటీ అయిపోయిన తర్వాత సమయం వృథా చేయకుండా విశ్రాంతి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని డ్రైవర్లకు సూచించారు. డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడుపుతున్నారని, ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని డ్రైవర్లను కొనియాడారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో జీరో యాక్సిడెంట్‌లో ఈ సంవత్సరం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం దైవాదినం, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ సురేఖ, ఎస్టీఐ కనకలక్ష్మి, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాల తొలగింపు

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణ పరిధిలో గల సిద్దాపురం రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుపై ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ సిబ్బంది మంగళవారం తొలగించింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత కొన్నేండ్లు అక్రమంగా నిర్మించుకున్న కట్టడాలను తొలగించామన్నారు. రోడ్డు చిన్నదిగా ఉండడం వల్ల విస్తరణలో భాగంగా అక్రమ నిర్మాణాలను తొలగించినట్టు చెప్పారు.



అందోల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సాయిలత

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సాయిలత మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నాగర్ కర్నూలు జిల్లా తేలకపల్లి నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను పాఠశాల అధ్యాపక బృందం శాలువా, పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు.



వరి పంటల పరిశీలన

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని చందంపేట, అల్మాయిపేట గ్రామాలలో వరి పంట పొలాలను సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత, అందోల్ మండల వ్యవసాయ అధికారి విజయరత్నలు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరిలో కాండం తొలుచు పురుగు, మొక్క ఎదుగుదల లేకపోవడం గమనించడం జరిగింద న్నారు. నివారణ చర్యలు పాటించి పంటలను కాపాడుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీకాంత్, రైతులు ప్రశాంత్, నగేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



మొరట్గా పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగణ-రాయికోడ్

మండల పరిధిలోని మొరట్గా సర్పంచ్ కాదులూరి పార్వతమ్మ పీరయ్య ఎంపీటీసీ వీణా రాణి మహ ంకాళి, స్పెషల్ ఆఫీసర్ తాహా, గ్రామ పంచాయతీ పాలక వర్గానికి గ్రామ పెద్దలు, ప్రజలు పంచాయతీ కార్యాల యంలో మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి.. ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. ఐదేండ్ల సర్పంచ్ పదవిని కాదులూరి పార్వతమ్మ పీరయ్య పూర్తి బాధ్యతతో నిర్వహించి.. ప్రతీక్షణం గ్రామా భివృద్ధే ధ్యేయంగా పని చేశారన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఐదేండ్లుగా గ్రామాభివృద్ధికి సహకరించిన పెద్దలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పదవి ఉన్నా.. లేకున్నా గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తాన న్నారు. సన్మానం పొందిన వారిలో సర్పంచ్ కాదులూరి పార్వతమ్మ పీరయ్య, ఎంపీటీసీ వీణరాని మహంకాళి, ఉప సర్పంచ్ నాగభాయి, కార్యదర్శి షాదుల్లా, వార్డ్ మెంబర్‌లు శబ్బు, సురేష్, లలితమ్మ, అంజి,సంగమ్మ, అంగన్వాడీ టీచర్ రూప, ఆయా సుందరమ్మ, పంచాయతీ కార్మికులు రవి, నస్రోద్దిన్, లాలయ్యా ఉన్నారు.



మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

నవతెలంగాణ-మద్దూరు

ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం రాత్రి మద్దూరు మండలంలోని వల్లంపట్ల గ్రామంలో పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లలో ఎలాంటి ఇసుక పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్టు నమ్మదగిన సమాచారం రావడంతో.. టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి వల్లంపట్ల గ్రామంలో ట్రాక్టర్లను పట్టుకొని మద్దూరు పోలీసులకు అప్పగించారు.

న్యాల్కల్ మండలంలో రెండోసారి భూకంపం..

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్కల్ మండంలోని ముంగి, టెకుర్, న్యాల్‌కల్ గ్రామాల్లో మంగళవారం మరోసారి స్వల్పంగా భూకంపం వచ్చింది. భూమి ఒక్కసారిగా కంపించడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కాగా ఇది భూకంపమేనా లేదా క్రషర్ల వల్ల ఇలా భూమి కంపిస్తున్నదా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. వచ్చింది భూకంపమా లేదా అని స్పష్టతనివ్వాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ కార్యకర్తపై ఈగ వాలినా...

హరీశ్‌రావు ఇంటిపై దాడి చేస్తా

సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సంచలన వ్యాఖ్యలు

- ఐదేండ్లలో బీఆర్ఎస్ కనుమరుగు
- హరీశ్‌రావు బీజేపీలో చేరుతారని జ్యోత్స్యం

నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ కార్యకర్తలపై ఈగ వాలినా.. అర్ధరాత్రి అయినా సరే హరీశ్‌రావు ఇంటిపై దాడి చేస్తానని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శంకుస్థాపన కోసం మంగళవారం సిద్దిపేటకు వచ్చిన మైనంపల్లి.. హరీశ్‌రావు, కేటీఆర్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వకుంట్ల కుటుంబాన్ని బొందపెట్టే వరకు నిద్రపోనని మండిపడ్డారు. పదేండ్లు భోగభాగ్యాలు అనుభవించిన కల్వకుంట్ల కుటుంబానికి పదవి పోగానే నిద్రపడటం లేదంటూ దుయ్యబట్టారు. ఎన్నో కష్టాలు పడి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే రెండు నెలలు కాకముందే ప్రభుత్వాన్ని కూలుస్తాను అనడం ఎంతవరకు న్యాయమన్నారు. 'బచ్చాగాడు కేటీఆర్ అంటూ వ్యాఖ్యానిస్తూ.. చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్టు రేవంత్‌రెడ్డిని కేటీఆర్ పోల్చాడని.. సిరిసిల్లలో కేకే.మహేందర్ పార్టీకి వైభవం తీసుకొస్తే ఆ పుట్టలో నువ్వు చేరలేదా అంటూ ప్రశ్నించారు. హైదరాబాద్ మొత్తం కబ్జాలు చేశాంని, అన్నింటిలో కేటీఆర్‌కు వాటాలు ఉన్నాయని ఆరోపించారు. 2004లో తన భార్య ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిందని, తెలంగాణ సెంటిమెంట్ ఉన్నప్పటికీ 2008లో తాను ఎమ్మెల్యేగా గెలిచానని, అది మైనంపల్లి బ్రాండ్ అని అన్నారు. కేటీఆర్ మల్కాజిగిరికి వస్తే 600 మంది కూడా లేరని, ఈరోజు ప్రేమతో ఎంతమంది వచ్చారో చూడాలన్నాడు. ప్రాణంపోతే తప్పా మైనంపల్లి కనబడదని, ఉన్నంత వరకు కల్వకుంట్ల కుటుంబాన్ని బొందపెట్టే వరకు విశ్రమించననీ శపథం చేశాడు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంపైనే రేవంత్ రెడ్డి ఫోకస్ చేశాడని.. కానీ మీ వైపు చూస్తే ప్రతీ ఒక్కరు జైల్లోనే ఉంటారని కేటీఆర్, హరీశ్‌రావులను ఉద్దేశిస్తూ అన్నారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన 5 వేళ ఎకరాలు, అనేక ప్రభుత్వ భూములను స్వాహా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. ఎవరైనా సరే తిరుగుబాటు చేస్తామన్నారు. ఎన్నికల్లో డబ్బుల పంపిణీ విధానాన్ని కేసీఆర్ తెచ్చాడని ఆరోపించారు. కేసీఆర్ అప్పులు తప్పా.. రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ అసెంబ్లీని కూల్చి కొత్తది కట్టాడని, కానీ డబుల్ బెడ్ రూమ్‌లు మాత్రం ఎంతమందికి ఇచ్చాడని ప్రశ్నించారు. అనేకమంది బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ లో చేరుతామంటే రేవంత్ రెడ్డి వద్దు అంటున్నాడని.. మీకు ఏది కావాలో అది చేస్తానని చెబుతున్నాడని, మీరు మాత్రం డబ్బులు తీసుకొని టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. డబ్బులతో టికెట్లు కొన్నవారే వచ్చే పార్లమెంటు ఎన్నికలలోపు 26-27 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేర్తారన్నారు. వచ్చే ఐదేండ్లలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందని, హరీశ్‌రావు బీజేపీలో చేర్తాడని సంచలన వ్యాఖ్యలు చేశారు.



వారానికి రెండుసార్లు సిద్దిపేటకు వస్తానని, అవసరం ఉంటే ఇక్కడే ఉంటానన్నారు. తనకోసం తోటపల్లిని సిద్దిపేట జిల్లాలో కలిపిన వ్యక్తి హరీశ్‌రావు అనీ ఆరోపించారు. అంతకుముందు బండ్ల గణేష్ మాట్లాడుతూ.. మైనంపల్లి హన్మంతరావు అన్న విధంగానే సిద్దిపేటకు వచ్చాడని.. ఆయన రియల్ హీరో అని అన్నాడు. ప్రత్యర్థులు డైపర్లు కొనుక్కునే పరిస్థితి సిద్దిపేటలో ఏర్పడనుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి మైనంపల్లి అని అన్నారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ.. మళ్లీ సిద్దిపేటకు వస్తానని, మీరు అనుకున్నది మాట్లాడతాన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి, మల్కాజ్ గిరి, సిద్దిపేట, మెదక్, ఇతర జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, జంగయ్య, రాజిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకురాలు ఝాన్సీ రాణికి డాక్టరేట్

నవతెలంగాణ-పటాన్‌చెరు



'ట్వీట్ల సెంటిమెంట్‌ను విశ్లేషించడం కోసం మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌ల అభివృద్ధిపై పరిశోధన చేసి, దానిపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్ గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఝాన్సీ రాణి తిరుమ లశెట్టిని డాక్టరేట్ వరించింది. హైదరాబా ద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం నుంచి ఆమె ఈ పట్టాను అందుకున్నారు. గోకరాజు రంగ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలోని సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ కె. అనూరాధ మార్గదర్శనంలో ఈ పరిశోధనను చేపట్టినట్టు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ట్వీట్ల పరిమాణంలో విపరీతమైన పెరుగుదలను ఎదుర్కోవడానికి మెషిన్ లెర్నింగ్‌ను ఉపయోగించి, మానసిక భావనల (సెంటిమెంట్) విశ్లేషణ ఆవశ్యకతపై ఆమె దృష్టి సారించిందన్నారు. సామాజిక వెబ్ డేటా, పరిశోధన సెంటిమెంట్ విశ్లేషణలో అధిక పరిమాణం సమస్యను కూడా పరి ష్కరించినట్టు తెలిపారు. దీని ఫలితంగా తక్కువ అంచనా ఖచ్చితత్వం, తప్పుడు హెచ్చరికలు అధిక సంఖ్యలో ఏర్పడ్డాయ న్నారు. ఈ సందర్భంగా గీతం విశ్వవిద్యాలయం హైదరా బాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెం ట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. సీతారామయ్య, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ మహబూబ్ బాషా షేక్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఆమెను అభినందించారు.

అభివృద్ధిలో ఆదర్శం పటాన్‌చెరు డివిజన్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ.1.60కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు డివిజన్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జెపి కాలనీ, శిశు మందిర్ రోడ్డు, బండ్లగూడ కాలనీలలో కోటి 60 లక్షల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం స్మశాన వాటికలో కార్పొరేటర్ మెట్టు కుమార్ సౌజన్యంతో నిర్మించ తలపెట్టిన దహన వాటిక నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తదనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శరవేగంగా విస్తరిస్తున్న పటాన్‌చెరు డివిజన్ పరిధిలో మౌలిక వసతులు కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, గోపాల్, ధనరాజ్ గౌడ్, చంద్రశేఖర్, రాజు, నాయకులు పాల్గొన్నారు.



మంత్రి అండతో ఉమ్మడి ఆస్తి కోడలుకు..

- ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన వృద్ధురాలు మల్లమ్మ

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



మంత్రి సీతక్కతోపాటు ఆమె వ్యక్తిగత సహాయకుడి అండతో తమ ఉమ్మడి ఆస్తిని.. తన కోడలు అక్రమంగా తన పేర చేయిం చుకున్నదని చాతబోయిన మల్లమ్మ అనే వృద్ధురాలు మంగళవారం హుస్నాబాద్ ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన చాతబోయిన మల్లమ్మకు ముగ్గురు కుమారులు. వారి పేరిట కిషన్‌నగర్‌లో ఉమ్మడి ఆస్తిగా ఓ ఇల్లు ఉంది. గతంలో ఉమ్మడిగా చేసిన అప్పు చెల్లించడానికి చిన్న కుమారుడి పేరుమీద ఆ ఇంటిని మార్చి.. బ్యాంకు రుణం తీసుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు రుణం ప్రయత్నాలు మొదలు పెట్టే లోపే చిన్న కుమారుడు కరోనాతో మృతి చెందాడు. కాగా ఆ ఆస్తిని చిన్న కుమారుడి భార్య సునీత అక్రమంగా తన పేరుమీదకు మార్చుకున్నదని వృద్ధురాలు మల్లమ్మ వాపోయింది. తమకు ఉన్న ఏకైక ఉమ్మడి ఆస్తిని మంత్రి పేరు చెప్పుకొని అక్రమంగా తన పేరు మీద మార్చుకున్నదని ఆవేదన వ్యక్తం చేసింది. తాను, తన కుమారులు ఒప్పంద పత్రాలు రాసుకున్నమని చెప్పినా కూడా లెక్క చేయకుండా మంత్రి సీతక్క నుంచి, ఆమె పిఏ నుంచి, జిల్లా అధికారుల ఒత్తిడి ఉందని తన కోడ లు పేరుమీద మార్పిడి చేసి గాంధీనగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి తనకు తీవ్ర అన్యా యం చేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఉమ్మడి ఆస్తి అయిన తమ ఇంటిని ఏక పక్ష ంగా తన కోడలు పేరిట మార్పిడి చేసిన పంచాయతీ కార్య దర్శి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ ఆర్డిఓకు ఇచ్చిన ఫిర్యాదులో కోరింది. అక్రమంగా తన ఆస్తిని తీసుకున్న తన కోడలు సునీతకు ఓనర్‌షిప్ సర్టిఫికెట్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని, నిలువ నీడను కోల్పోయిన తనకు, మిగిలిన ఇద్దరు కుమారులకు న్యాయం చేయాలని ఆర్డీవోను మల్లవ్వ వేడుకుంది.

భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి మండల తహసీల్దార్ ఫర్హీన్ షేక్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూమిని గుర్తించే ప్రక్రియ మొదలైందన్నారు. అలా గుర్తుంచిన భూమిలో ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. కల్వకుంటలో 395, 396 అనే సర్వే నెంబర్లను ప్రబుత్వ భూమిగా గుర్తించినట్టు చెప్పారు. అదేవిధంగా 350 సర్వే నెంబర్‌లో గల భూమిని 224 కింద 19 గుంటలు కబ్జా చేశారన్నారు. దాన్ని వెంటనే స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా హనుమాన్‌గడ్డలో 256 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని.. ఉందులో కొంత భూమిని పేదలకు అసైన్డ్ చేసినట్టు చెప్పారు. ఎలక్షన్ సమయాన్ని ఆసరాగా తీసుకుని నాడు కొందరు భూకబ్జా చేశారన్నారు. ప్రజలు ఇలాంటి అసైన్డ్ భూములను కొని మోసపోవద్దు అని సూచించారు. అలాగే ఇస్మాయిల్‌ఖాన్‌పేట్, హనుమాన్ గడ్డలో ఇసుక ఫిల్టర్లు మళ్ళీ నడిపేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో గల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల న్నారు. ఆయా ప్రభుత్వ భూములు ఆక్రమణలు కాకుండా, వాటి చుట్టూ రెండు వరుసల్లో మొక్కలు పెడతామన్నారు. మండలంలో హనుమాన్‌నగర్ పసల్వాది తాండాల్లో అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తే.. కృత్రిమంగా ఇసుక తయారు చేసే వారికి హెచ్చరిక చేశారు. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కట్టుకున్న భర్త, కన్న కొడుకే హంతకులు

- సిరూర్ గ్రామ శివారులో దొరికిన గుర్తుతెలియని మహిళ మృతదేహం కేసులో వెలుగులోకి నిజాలు..

నవతెలంగాణ-రాయికోడ్



మండలంలోని సిరూర్ గ్రామ పరిధిలో గల మంజీరా నది వద్ద ఇటీవలే రగ్గులో చుట్టిపెట్టి దొరికిన మహిళ మృత దేహం కేసులో.. కట్టుకున్న భర్త, కన్న కొడుకే హంతకులుగా తేలింది. స్థానిక రూరల్ సీఐ వెంకటేష్ మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు.

సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామానికి చెందిన దర్జీ మల్లేశ్వరి(42)కి గత ఐదేండ్లుగా మతిస్థితిమితం సరిగా లేదు. దాంతో ఇంట్లో వాళ్లను కొడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఆమె కుటుంబ సభ్యులు పలుమార్లు ఆసుపత్రుల చుట్టూ తిప్పినా.. ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో గతనెల 28వ తేదీన బెడ్‌పై పడుకున్న మల్లేశ్వరిని ఆమె భర్త సత్యనారాయణ, పెద్దకొడుకు ప్రవీణ్‌లు తాడుతో గొంతు బిగించి హతమార్చారు. అనంతరం మృతదేహాన్ని ఒక రగ్గులో చుట్టి అందులో బండరాయి పెట్టి కారులో వేసుకుని జోగిపేట మీదుగా సిరూర్ బ్రిడ్జీ వద్దకు వెళ్లి నదిలో పడేసి ఇంటికి వెళ్లారు. అనంతరం 31వ తారీఖున సంగారెడ్డిరూరల్ పోలీస్ స్టేషన్‌లో మల్లేశ్వరి తప్పిపో యిందిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసు కున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ కెమెరాల సాయంతో విచారణ జరపగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విలేకర్ల సమావేశంలో స్థానిక ఎస్సై వెంకట్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జి-I ర్యాంక్ క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- బ్లాస్టింగ్‌లో గాయపడిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి
- సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కి వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి



కంది మండల పరిధిలోని ఎర్దనూర్ గుట్టల్లో గల జి-I ర్యాంక్ క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌ని కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. ఎర్దనూర్ గ్రామంలో గల జి-I ర్యాంక్ క్రషర్ ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ఇటీవలే అక్రమ బ్లాస్టింగ్ చేసిందన్నారు. ఆ బ్లాస్టింగ్ ధాటికి ఓ రాయి వేగంగా వచ్చి.. అక్కడికి దగ్గర్లోనే తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న రమావత్ భీముడు అనే రైతు చేతిపై పడిందన్నారు. ఈ ప్రమాద ధాటికి ఆ రైతు కుడి చేతిని కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. బాధిత రైతు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రషింగ్ కంపెనీలతో రైతులు ఎలాంటి పనులు చేసుకోలేక కూలీలుగా మారుతున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా అక్కడ ఉన్న క్రషింగ్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, రవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా దారులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మండలంలోని పసల్వాది గ్రామంలో గల 599 సర్వే నెంబర్‌లోని అసైన్డ్ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్వేనెంబర్ 559 భూమిని మంగళవారం పరిశీలించారు. అనంతరం నరసింహులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు, దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను పేదల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాక్కోవడం సిగ్గుచేటన్నారు. అసైన్డ్ భూముల్లో ఇప్పటికే ఇటుక బట్టీల నిర్వహణ కొనసాగుతున్నదని.. ఈ భూముల్లో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్నుబడి ఈ భూముల చుట్టూ కనీలు పాతడం జరిగిందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు ఊరుకుంటున్నదని ప్రశ్నించారు. కనీలు పాతిన వారిపై అసైన్డ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ భూములను ప్రభుత్వం స్వాధీన పరచుకొని పేదలకు తిరిగి ఇవ్వాలన్నారు. లేనియెడల పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు బి.శ్రీనివాస్, రత్నయ్య, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

గౌడ కుటుంబాల గ్రామ బహిష్కరణను ఖండిస్తున్నాం

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్

బహిష్కరించిన పెత్తందారులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



జగిత్యాల జిల్లా మెట్టుపల్లి మండలం ఆత్మనగర్, ఆత్మకూరు గ్రామాలకు చెందిన 100 గౌడ కుటుంబాలను విలేజ్ డెవలప్మెంట్ కమిటీ (వీడీసి)ల పేరుతో గ్రామ పెత్తందా రులు బహిష్కరించడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ తెలిపారు. గౌడ సంఘం సభ్యుల అందరూ 20 ఏండ్ల క్రితం 22 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నార న్నారు. అయితే ఆ భూమిలో కల్లు గీత వృత్తి చేయడానికి ప్రయత్నించగా వీడీసి సభ్యులు అడ్డుకొని.. గౌడ కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేస్తున్నట్టు తీర్మానం చేయడం దారుణమన్నారు. వారి వద్ద అసలు ఎవరు కల్లు తాగొద్దని, కిరాణం దుకాణాల్లో సరుకులు ఇవ్వొద్దని, హెటల్లో చాయ్ ఇవ్వొద్దని, గ్రామంలో శుభకార్యాలకు పిలవొద్దని, బీడీలు చుట్టే మహిళలకు ఆకు, తంబాకు వేయొద్దని తీర్మానం చేశారని.. ఇది ఉల్లంఘించిన వారికి రూ.50 వేల జరిమానా విధిస్తున్నట్టు కట్టుబాట్లు పెట్టడం సిగ్గుచేటు అన్నారు. ఇన్ని దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. తక్షణమే వీడీసిలను రద్దు చేయాలని.. గౌడ కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ బహిష్కరణకు పాల్పడిన పెత్తం దారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బుకింగ్ చేసి 20 రోజులైనా.. అందని గ్యాస్

నవతెలంగాణ-సంగారెడ్డి

గ్యాస్ సిలిండర్ బుక్ చేసి 20 రోజులవుతున్నా.. డిస్ట్రిబ్యూటర్ నిర్లక్ష్యం వల్ల పేదలకు గ్యాస్ అందడం లేదని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎం.నర్సింలు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఫసల్వాది గ్రామంలో గత 20 రోజుల క్రితం భారత్ గ్యాస్ సిలిండర్ కోసం పలువురు పేదలు బుకింగ్ చేసుకున్నారు. నేటికి 20 రోజులు గడుస్తున్నా.. సదరు గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ నిర్లక్ష్యం వల్ల పేదలకు గ్యాస్ అందలేదన్నారు. ఈ నేపథ్యంలో పలువురు వినియో గదారులు కంది, బాలాజీ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న గ్యాస్ ఆఫీసుకి వెళ్లి డిస్ట్రిబ్యూటర్‌ను ప్రశ్నించగా.. మీ దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడని ఆరోపించారు. వినియోగదారుల పట్ల దురుసుగా ప్రవ వర్తించిన సదరు డిస్ట్రిబ్యూటర్‌పై వెంటనే చర్యలు తీసుకో వాలని డివ రాండ్ చేశారు. లేనియెడల లబ్దిదారులతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో శ్రీనివాస్, వీరేశం, మొగులయ్య, యాదయ్య, పెంటయ్య, దశరథ,నగేష్, చంద్రయ్య, ఎల్లమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రౌడీ షీటర్లు చట్టానికి లోబడి ఉండాలి



నవతెలంగాణ-జహీరాబాద్

రౌడీ షీటర్లు చట్టానికి లోబడి ఉండాలని.. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ రవి హెచ్చరించారు. జహీ రాబాద్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, జహీరాబాద్ టౌన్ సబ్-ఇన్‌స్పెక్టర్.. జహీరాబాద్ పట్టణ పరిధిలో గల రౌడీ షీటర్‌లను మంగళవారం పిలిపించి కౌన్సె లింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగా లని పలువురు రౌడీ షీటర్‌లకు సూచించారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించినా, భూ తగాదాల్లో తల దూర్చినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. అంతేకాకుండా వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. ఎవరికైనా భూ తగాదాలు ఉంటే పరిష్కారం కోసం కోర్టులను ఆశ్రయించాలని, రౌడీ షీటర్‌లను సంప్రదిస్తే వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తావ న్నారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన గడిమోహల్లా రౌడీ షీటర్ ఆబెద్, ఆబెద్ హుస్సేన్‌కు కౌన్సిలింగ్ ఇచ్చినట్టు తెలిపారు.

జాతీయ రహదారి కోసం భూసేకరణ



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

జాతీయ రహదారి కోసం భూసేకరణ సేకరణ చేపట్టడం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఆర్డీఓ వెంకటేష్ అన్నారు. ఎన్‌హెచ్-161బి నిజాంపేట్-బీదర్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నారాయణఖేడ్ మండలంలోని బాణాపూర్ గ్రామంలో భూసేకరణ కోసం ఆర్డీఓ వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఈ సమావేశంలో రైతుల అభ్యంతరాలు, వారికి నష్టపరిహారం తదితర అంశాలపై చర్చించినట్టు తెలిపారు. అలాగే రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఈఆర్‌అండ్‌బీ రామకృష్ణ, నారాయణఖేడ్ తహశీల్దార్ దేవదాస్, గ్రామస్థాయి ఆధికారులు జ్యోతి, గ్రామ రైతులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



పింఛను కోసం వికలాంగులు, వృద్ధుల కష్టాలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

పింఛన్ కోసం వికలాంగులు, వృద్ధులు తీరని నానా అవస్థలు పడుతున్నారని బొల్లారం బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ కృష్ణారెడ్డి అన్నారు. వృద్ధులు, వికలాంగులు పోస్ట్ ఆఫీస్ దగ్గర నిల్చొని సోమవారం చేపట్టిన నిరసనకు ఆనంద్ కృష్ణారెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 5:00 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పెన్షన్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ డబ్బులను డైరెక్ట్‌గా అకౌంట్లో పడేటట్లు చేయాలని కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు.

జోగిపేట సీఐగా అనిల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట సీఐగా డి.అనిల్‌కుమార్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాదులోని బహదూర్‌పూర్ సీఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై జోగిపేటకు వచ్చారు. అంతకుముందు ఇక్కడ పనిచేస్తున్న నాగరాజును హైదరాబాదుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన సీఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.



ఘనంగా శేషారెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ వార్డు సభ్యులు శేషారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను రవీందర్ రెడ్డి హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయ్ రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, గిరి, టీచర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మనూర్

కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహనీయుల చిత్రపటాలతో తీసుకువచ్చిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం మనూర్ ఎస్ఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. అంబేద్కర్, జ్యోతిరావుపూలే, సావిత్రి బాయి పూలే, కొమరం భీం లాంటి మహనీయుల చిత్రాలతో అద్భుతమైన క్యాలెండర్‌ను తీసుకువరాడం అభినందనీయమన్నారు. కుల వివక్ష, అంటరా నితనం, సమానత్వం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న కేవీపీఎస్ బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు, మండల బాధ్యులు కేవీపీఎస్ నాయకులు లింగం, అంబాదాస్, నర్సింలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డినగర్ ప్రధాన కార్యదర్శిగా తిరుమల్‌గౌడ్



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్లోని రామచంద్రారెడ్డినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా తాళ్ళ తిరుమల్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గంలో వివిధ భాద్యతలను చేపట్టిన తిరుమల్‌గౌడ్‌ను సోమవారం సాయంత్రం కాలనీ పెద్దల సమక్షంలో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనవరి 26న జరిగిన కాలనీ జనరల్ బాడీ సమావేశంలో అధ్యక్షులుగా జగన్నాథ్ రెడ్డిని ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శితో పాటు పూర్తి కార్యవర్గాన్ని సోమవారం సాయంత్రం కాలనీ పెద్దల సమక్షంలో ప్రకటించారు. అందరినీ కలుపుకుంటూ కాలనీ అభివృద్ధి, సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



నవతెలంగాణ-గుమ్మడిదల

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఆదేశాలతో గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో 17 మంది పట్టుబడగా.. ఆ నేరాలకు రూ.1,70,000 జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావొద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే రూ.10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



కాంగ్రెస్ పార్టీలోకి వలసలు

నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాల్టీలో బీఆర్ ఎస్, బీఎస్పీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆంజనేయులు, ఎల్లయ్య, హనుమంత్ రావు, అఖిల్ వారి బృందంతో కలిసి కాంగ్రెస్ పార్టీ మున్సిపాల్టీ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం కోసం ఈ ప్రాంతంలో తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు తెలిపారు.

లోప పోషణ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అంగన్వాడీ భవన నిర్మాణాలు, ఓల్డ్ ఏజ్ హెూమ్ పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో అంగన్వాడీ పరిధిలో గల (సామ్, మామ్) లోప పోషణతో ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించి, మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన ఆయా పనుల పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ భవనాల నిర్మాణ పురోగతి, ఓల్డ్ ఏజ్ హెూమ్ పురోగతి, బాలసదన భవనాలకు సంబంధించిన ఆయా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ పరిధిలో లోప పోషణతో ఉన్న(సామ్, మామ్) పిల్లలు సాధారణ స్థితికి వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అందుకు సీడీపీఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంగన్వాడి భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా అంగన్వాడి సెంటర్లలో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.. సంగారెడ్డి మహిళా ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఓల్డ్ ఏజ్ హెూమ్ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పనులు నాణ్యతగా చేయించాలని సూచించారు. ఓల్డ్ ఏజ్ హెూమ్‌కు సంబంధించి అవసరమైన ఫర్నిచర్, బెడ్స్ లాంటివి ఏర్పాటుకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు అందజేయాలని సంబంధిత ఈఈకి సూచించారు. నారాయణఖేడ్ బాలసదనంకు సంబంధించిన ప్రతిపాదనలు అందజేయాలని, సంగారెడ్డి బాలసదన భవన నిర్మాణానికి వెంటనే టెండర్స్ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని డీడబ్ల్యుఓకు సూచించారు. ప్రీ స్కూల్ విద్యను టైం టేబుల్ మేరకు బోధించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిడబ్ల్యుఓ సంధ్యారాణి, పంచాయతీరాజ్‌శాఖ సంగారెడ్డి, ఈఈలు, సీడీపీఓలు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



నవతెలంగాణ-రామచంద్రాపురం

భారతినగర్ డివిజన్ పరిధిలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. భారతీ నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ, మాధవ నగర్ కాలనీలలో నూతనంగా ఏర్పాటు చేసిన మంజీరా మంచి నీటి సరఫరా పైపులైన్లను స్థానిక కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించాలన్న సమున్నత లక్ష్యంతో దేశంలోని మొట్టమొదటిసారిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అందులో భాగంగా భారతి నగర్ డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం





నవతెలంగాణ-నారాయణఖేడ్, పటాన్‌చెరు

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ దిష్టిబొమ్మను నారాయణఖేడ్ ఇందిరా చౌక్ వద్ద, అలాగే పటాన్‌చెరు పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం దహనం చేశారు. ఖేడ్‌లో డీసీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌రెడ్డి, పటాన్‌చెరులో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మంచిర్యాలలో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని.. ఆయన్ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ముఖ్యమంత్రినే చెప్పుతో కొడతానంటూ మాట్లాడడం ప్రజాస్వామ్యానికే హానికరమన్నారు. రాజకీయాలంటే విమర్శ, ప్రతి విమర్శ ఉండాలి కానీ.. అసభ్య పదజాలంతో దూషించడం సిగ్గుచేటన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ముఖ్యమంత్రి పై చేసిన వ్యాఖ్యలు అత్యంత కిరాతకమన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తెలంగాణలో ఎక్కడా కూడా తిరగనియ్యమని హెచ్చరించారు. వెంటనే బాల్క సుమన్‌ను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్రవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఖేడ్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, ముంతాజ్, పండరి రెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్, యూసుఫ్, సంజీవ్ పటేల్, నారాయణ జాదవ్, రాజు, హనుమారెడ్డి, అర్జున్, జయరాజ్, పటాన్‌చెరులో మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ గౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్,నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, డీసీసీ కార్యదర్శి సామయ్య నాయకులు ప్రభు, అశోక్, కుంచాల కిషన్, లక్ష్మి, నరేందర్ గౌడ్ ఆసిఫ్ హమీద్. పాషా, రాజు, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు సాకి చెరువులో మునిగి వ్యక్తి మృతి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రమాదవశాత్తు సాకి చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలానికి చెందిన ఎండి కాజా మైనోద్దీన్(49) హైదరాబాద్ నగరంలోని గోల్కొండకు బతుకుదెరువు కోసం 12ఏండ్ల క్రితం వచ్చి మటన్ షాపులో పనిచేస్తున్నాడు. కాగా ఈనెల రెండున అమీన్పూర్ గల సమ్మక్క సారక్క జాతర వద్ద మటన్ కొట్టేందుకు వెళుతున్నట్టు చెప్పి ఇంటి నుంచి వెళ్ళాడు. కాగా పట్టణంలోని సాకి చెరువులో అతడు శవమై నీటిపై తేలి ఉండడంతో సమాచారం అందుకున్న పోలీసులు మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని జేబులో ఉన్న ఆధార్ ఆధారంగా మృతుడిని గుర్తించారు. కాగా ఆదివారం గోల్కొండ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదయింది. ఈ మేరకు ఎస్సై కుర్షిద్ అలీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టపడి చదవండి.. లక్ష్యాన్ని సాధించండి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 7000 మంది పదో తరగతి విద్యార్థులకు సొంత నిధులతో ప్రత్యేక మోటివేషన్ క్లాసులు, పరీక్షా సామాగ్రి పంపిణీ



నవతెలంగాణ-పటాన్‌చెరు

విద్యార్థి జీవితంలో 10వ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, ఇష్టపడి చదివి.. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు సూచించారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్లో పటాన్‌చెరు, అమీన్పూర్, రామచంద్రపురం మండలాలతో పాటు తెల్లాపూర్, అమీనపూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జీ.వి.ఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస ప్రేరణ తరగతులను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన పదో తరగతి పరీక్ష సమయంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి అన్న అంశంపై ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వీరేందర్‌తో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ఫోన్, టీవీలకు పిల్లలను దూరంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సొంత నిధులతో కొనుగోలు చేసిన పరీక్ష మెటీరియల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. తదనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వీరేందర్, డాక్టర్ పూర్ణ కృష్ణ, ఎంఈఓ రాథోడ్‌లు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, సుప్రజా వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, పట్నం రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బొల్లారం కౌన్సిలర్ చంద్రారెడ్డి

- 1000 మందితో కలిసి పార్టీమార్పు
- నమ్ముకున్న కార్యకర్తలు, ప్రజల కోసమే హస్తం గూటికి : కౌన్సిలర్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి తన అనుచర గణంతో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా అనుచరులతో కలిసి ర్యాలీగా బయలుదేరి బొల్లారం మున్సిపల్ పరిధిలో ఉన్న మాజీ ఎంపీపీ వి.ప్రతాప్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం దాదాపు 1000 మంది కార్యకర్తలు, అభిమానులు, పలువురు కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, పటాన్చెరువు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్‌లు.. చంద్రారెడ్డిని ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వి.చంద్రారెడ్డి మాట్లాడుతూ.. 2014 నుంచి బీఆర్ఎస్‌లో ఒక కార్యకర్తగా, నాయకుడిగా ప్రజాసేవ చేస్తున్న తనకు పార్టీ ఏనాడు అండగా నిలవలేదని వాపోయారు. అటు అభివృద్ధి విషయంలోనూ ఇటు నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయడంలోనూ పార్టీ తనకు తీవ్ర నష్టాన్ని కలుగజేసిందన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు కూడా తనను పట్టించుకోలేదని వాపో యారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసే తనకు.. పార్టీలో సముచిత స్థానం లభించక పోవడంతో పార్టీ మారేందుకు సిద్ధమయ్యానని స్పష్టం చేశారు. ప్రజలకు న్యాయం చేస్తూ అభివృద్ధికి దోహదపడే కాంగ్రెస్ పార్టీలో ఇక ముందుకు వెళ్తానన్నారు. బొల్లారం అభివృద్ధి కోసమే తాను పార్టీ మారుతున్నట్టు చెప్పారు. తనని నమ్ముకున్న ప్రజలకు కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానన్నారు. తన వెంట నడిచి వచ్చిన కౌన్సిలర్లకు, నాయకులకు, కార్యకర్తలకు చంద్రారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ రెడ్డి, కౌన్సిలర్లు సంతోష, నిహారిక, జయమ్మ, గోపాలమ్మ, రాధా, చంద్రయ్య, కోప్షన్ సభ్యులు మునీర్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, స్థానిక మున్సిపల్ నాయకులు లక్ష్మారెడ్డి, సంపత్‌రెడ్డి, యాదిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వరప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణం రాజు,రాజ్ గోపాల్, మాజీ వార్డ్ మెంబర్ భాస్కర్, దిననాథ్, నరేందర్, శ్రీను, లక్ష్మన్, శ్రీకాంత్ రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు పెండింగ్ వేతనాలివ్వాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న గత రెండు నెలల వేతనాలను వెంటనే ఇవ్వాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ డా.శ్రీవాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, సెకండ్ ఏఎన్ఎంలకు రెండు నెలల వేతనాలు ఇవ్వలదన్నారు. దాంతో కుటుంబ పోషణ కష్టంగా మారి.. వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుంబాన్ని వదిలేసి ఉదయం ఏడు గంటల నుంచి ప్రజల ఆరోగ్యాలు కోసం నిరంతరం పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న 2 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరి ంచారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ ఎంప్లాయిస్ యూ నియన్ నాయకులు మాధవి,సంపూర్ణ, శ్రావణి, గీత తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ పార్లమెంట్ అధ్యక్షులుగా ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

యువజన కాంగ్రెస్ జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జిగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నల్ల ప్రతాప్‌రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు బి.శ్రీనివాస్.. ప్రతాప్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి.. ఇన్చార్జిగా నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జాతీయ ఇంచార్జ్ శ్రీనివాస్‌కు, తెలంగాణ ఇంచార్జ్ సురభి ద్వివేదికి, రాష్ట్ర అధ్యక్షులు శివసేనరెడ్డికి పార్లమెంట్ నాయకులు ఉజ్వల్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, శాసనసభ్యులు మదన్ మోహన్, లక్ష్మీ కాంత్రావు, సంజీవరెడ్డికి జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువస్తామన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

- రైతు, కూలీ, కార్మిక హక్కుల్ని కాపాడుకుందాం
- ప్రజా, కార్మిక సంఘాల నాయకులు
- 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేరూలని కరపత్రాల పంపిణీ, సమ్మె నోటీసులు అందజేత

నవతెలంగాణ-జోగిపేట, నారాయణఖేడ్‌రూరల్, సదాశివపేట, కొండాపూర్

ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పలువురు ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఊరురా కరపత్రాల పంపిణీ, సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తూ.. పరిశ్రమల యాజమాన్యా నికి, పలువురు అధికారులకు సమ్మె నోటీసులు అందజేస్తున్నారు.

ఈ నేపథ్యంలో మంగళవారం జోగిపేటలో రవాణా రంగ కార్మికులకు కరపత్రాలు పంచుతూ, సంతకాల సేకరణ చేపట్టారు. నారాయణఖేడ్‌లో మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు సమ్మెలో పాల్గొంటున్నామని అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. కొండాపూర్ మండల పరిధిలోని మునిదేవునిపల్లి గ్రామంలో రైతుసంఘం ఆధ్వర్యంలో కరపత్ర ప్రచారం నిర్వహించారు. సదాశివపేటలోని స్థానిక ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆత్మకూర్ పీహెచ్‌సీలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జోగిపేటలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, ఖేడ్‌లో సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షులు అతిమేల మాణిక్, సదాశివపేటలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్, కొండాపూర్‌లో తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటు పరం చేస్తున్నదని మండిపడ్డారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తూ.. పేదల పొట్ట కొడుతున్నద న్నారు. అంగన్వాడీ, ఆశా, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు, ఉద్యోగులకు వేతనాలు పెంచాలని అడిగితే పట్టించుకోని మోడీ ప్రభుత్వం.. అంబానీ, ఆదానీలకు లాంటి పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ పరుస్తూ దేశ సంపదను దోచి పెడుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి.. బీజేపీ ప్రభుత్వం తక్షణమే ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని, నిత్యావసరకులు ధరలు తగ్గించి, కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలన్నారు. ఉపాధి హామీని 200 రోజులకు పెంచుతూ రోజువారి కూలి రూ. 600 చేయాలన్నారు. కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 16న జరగనున్న సమ్మె, గ్రామీణ బంద్‌లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జోగిపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్‌కు కార్మికులతో కలిసి సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ సమ్మె వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను కాంట్రాక్టర్ బెదిరింపులకు గురి చేస్తున్నాడని.. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను విద్యాసాగర్ కోరారు. కాగా ఈ కార్యక్రమాల్లో జోగిపేటలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు దుర్గయ్య, మల్లేశం, రవాణా రంగ కార్మికులు రమేష్, శివరాజ్, రాజు, పోతాగౌడ్, మురళి, ఖేడ్‌లో సీఐటీయూ నాయకులు శకుంతల రాజు రవి అరుణ్ కాన్సిరాం సంతోష్ మున్సిపల్, ఆశా వర్కర్లు, సదాశివపేటలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు యశోద, మాధవి, శశికళ, శోభారాణి, బాలమణి, లక్ష్మీ, జ్యోతి, కొండాపూర్‌లో వ్యవసాయ కార్మికసంఘం మండల నాయకుడు గోపాల్, నర్సింలు, రైతుసంఘం జిల్లా నాయకులు శ్రీను,సురేష్, చంద్రయ్య,కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.











ప్రభుత్వ భూములను సర్వే చేసిన అధికారులు

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట



పెద్దశంకరంపేట పట్టణం తిరుమలాపూర్ శివారులోని సర్వేనెంబర్ 1,258లలో ప్రభుత్వ భూములను తుప్రాన్ డివిజన్ డిఐ శేఖర్ వర్మ, సర్వేయర్ నాగరాణి, అధికారులు మంగళవారం సర్వే చేపట్టారు. సర్వే నెంబర్ 1లో ప్రభుత్వ భూమి స్థలాలలో హద్దులను గుర్తించి, 258లో కూడా హద్దులను గుర్తించి పూర్తి సర్వే చేస్తామన్నారు. అనంతరం నివేదికను జిల్లా సంబంధిత అధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పేట ఆర్ఐ శరణప్ప, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

- అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట



ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రహదారి నిబంధనలను పాటించాలని అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలో రహదారి నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తమ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని. వాహనాలకు సంబంధించిన సరైన ధృవపత్రాలు తప్పనిసరిగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని. కార్లు ఇతర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా సీటు బెల్టును ధరించాలని ఆమె సూచించారు, ఎట్టి పరిస్థితుల్లోనూ రాంగ్ రూట్లో ప్రయాణం చేయవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేట ఎస్సై బాలరాజ్ ఎ ఎస్ఐ సునీత పోలీస్ సిబ్బంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కల్వకుంటలో నిరుపయోగంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

- నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే ప్రారంభించాలి
- నిరుపేదలకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిరుపేదల కోసం వేల కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించేది ఎప్పుడని మండలంలోని లబ్దిదారులు వాపోతున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట చల్మెడ గ్రామాలలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టించారు. కానీ అప్పటి ప్రభుత్వం వాటిని నిరుపేదలను గుర్తించి ప్రారంభించ లేక పోయింది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కిటికీలు, డోర్లు లేక కొంతమంది ఆకతాయిలకు అడ్డాలుగా మారాయి. ప్రభుత్వాలు ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి లక్షల కొద్ది రూపాయలతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తున్నారు కాని వాటిని ప్రారంభించలేకపోతున్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వాలు వాటిని పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఒక ప్రభుత్వం కట్టిస్తే ఇంకొక ప్రభుత్వం వాటిని పక్కన పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ విధంగా జరగకుండా నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అసలైన నిరుపేదలను గుర్తించి వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే ప్రారంభించాలి



గత ప్రభుత్వం నిరుపేద కుటుంబాల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి. అసలైన నిరుపేదలను గుర్తించి పంపిణీ చేయాలి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయని యెడల ఆకతాయిలకు అడ్డాలుగా మారే ప్రమాదం ఉంది.

జీడి మహేందర్ గౌడ్, కల్వకుంట గ్రామవాసి

నిరుపేదలను గుర్తించి అందజేయాలి



గత ప్రభుత్వం వేలకోట్లతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి, నిరుపేదలను పేదలను గుర్తించి పంపిణీ చేయడం లేదు. కిటికీలు తలుపులు ఊడిపోతున్నాయి. వాటికి రక్షణ లేక ఆకతాయిలకు అడ్డాలుగా మారాయి. మందు బాబులకు అడ్డగామారి ఇండ్లు శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉంది. వెంటనే వాటిని ప్రారంభించి నిరుపేదలకు అందించాలి.

భూమయ్య, కల్వకుంట వాసి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ - మెదక్

ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం గురించి పట్టణాలు, మండలల్లో స్వయం సహాయక బృందాలు, పట్టణాభివృద్ధి సంస్థ రిసోర్స్ పర్సన్స్ ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని ఆదేశించారు. చేతివృత్తుల సంఖ్య గణనీయంగా ఉన్నదని, కమ్మరి కుమ్మరి, వడ్రంగి, మంగలి, చాకలి, వడ్డెర, అవసలి, కంసాలి, కులవృత్తుల వంశ పారపర్యంగా కొనసాగిస్తున్న వారందరిని విశ్వకర్మలుగా పిలుస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో 18 కులవృత్తుల వారి జీవితాల్లో వెలుగు నింపడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. స్వయం ఉపాధిగా తమ వృత్తిలో చేతి పనిముట్లు ఉపయోగిస్తూ జీవించే వడ్రంగి పనులవారు, ఇనుప పనిముట్లు చేసే కమ్మరి, కంసాలి వారు, చర్మకార వృత్తిలోని మోచీలు, వీధుల్లో తిరుగుతూ తాళాలు ఇతర మరమత్తులు చేసేవారు, బీట కమ్మరీ, బంగారు, వెండి తయారు చేసే అవసలి, కుండలు చేసే కుమ్మరి, బుట్టలల్లే మేదరి, ఇంటి నిర్మాణ పనుల్లో ఉండే ఉప్పరి, పొరకలు, తట్టలు చేసే ఎరుకల వారు, బొమ్మలు చేసేవారు, చాకలి, మంగలి, పువ్వులు అల్లే వారు, దర్జీ, చేపలు పట్టే వలలు తయారు చేసేవారు ఇలా మొత్తం 18 కులవృత్తులు ఈ పథకానికి అర్హులని తెలిపారు.

మొదటి విడత లక్ష రూపాయల రుణం

పనిముట్లకు ప్రోత్సాహకంగా రూ. 15,000 అందించడంతో పాటు గుర్తింపు కార్డ్, ధృవీకరణ పత్రం అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. మొదటి విడత లక్ష రూపాయల వరకు రుణసదుపాయంగా అందజేస్తారని, తిరిగి 18 మాసాలలో చెల్లించాలన్నారు. రెండవ విడత రెండు లక్షల వరకు లోన్ అందజేస్తారని 36 నెలల్లో తిరిగి చెల్లించాలని పేర్కొన్నారు. పిఎం స్వనిధి, ముద్ర, పిఎం ఇజిపి ద్వారా లోన్ పొంది తిరిగి చెల్లించడంలో విఫలమైన వారు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి అనర్హులని తెలిపారు. నైపుణ్యం పెంపుదల, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహకం వ్యాపార అవకాశాల పెంపుదలకు సంబంధించిన ముఖ్యాంశాలు ఉంటాయన్నారు. పిఎం విశ్వకర్మ పోర్టల్‌లో వివరాలు పొందుపర్చాలని తెలిపారు. సాంప్రదాయ కళలకు నైపుణ్యానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిరంతరం సంభవిస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని, ఆధునిక పద్ధతులతో 5 రోజుల నుంచి ఏడు రోజుల పాటు శిక్షణ అందిస్తారని తెలిపారు. శిక్షణ పొందినవారికి రోజుకు 500 స్టైఫండ్ అందిస్తారని, ప్రాథమిక కళ నైపుణ్య శిక్షణ, ఆధునిక కళ నైపుణ్యం పెంపు కోసం 15 రోజుల పైచిలుకు శిక్షణ అందిస్తారని తెలిపారు. శిక్షణ పొందిన వారికి నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ధృవీకరణ పత్రాలను అందజేస్తారన్నారు.



ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డుతో డిజిటల్ సేవా కేంద్రాలలో ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ వారు వివరాలను ధృవీకరిస్తారని, జిల్లా అమలు కమిటీ ఆమోదముద్ర వేస్తుందని, ఎమ్ఎస్ఎంఈ, ఎంఎస్డిఇ బ్యాంకు తదితర అధికారులతో కూడిన కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శైలేష్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కృష్ణమూర్తి, డిఆర్డిఓ శ్రీనివాస్, మొప్మా ఇందిరా, డిపిఓ సాయిబాబా, లేబర్ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు దేశవ్యాప్త కార్మికుల సమ్మె నోటీసు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ మల్లేశం

నవతెలంగాణ-వెల్దుర్తి



కేంద్ర బీజేపీ కార్పొరేటు, మతతత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ తలపెట్టే నోటీసును ఎంపీడీవో వెంకటలక్ష్మిమ్మకు సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ. మల్లేశం అందజేశారు. మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి సమ్మె నోటీసును అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈనెల 16న జరగబోయే దేశభక్తి సమ్మెకు అసంఘటిత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటించి మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జి సీటు ప్రకటించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ దుర్గప్ప గారి అశోక్ గౌడ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. మున్సిపల్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్, కౌన్సిలర్ రామచందర్, బీఆర్ఎస్ నాయకులు కుమ్మరి నాగేష్, ఆంజనేయులు గౌడ్, రామాగౌడ్, రొట్టం పెద్దలు, పిఆర్ ఏఈ స్వామి దాస్ తదితరులు పాల్గొన్నారు.

'శానిటేషన్ స్పెషల్ డ్రైవ్' సన్నాహక సమావేశం

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధిలోని శేరిపల్లి ప్రత్యేక అధికారి మెంగని యాదగిరి ఈ నెల 7 నుంచి 15వ తేది వరకు జరిగే "శానిటేషన్ స్పెషల్ డ్రైవ్" కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, అంగన్వాడీ, ఇందిరా క్రాంతి, ఉపాధి హామీ పథకం, మిషన్ భగీరథ గ్రామ స్థాయి గ్రామ స్థాయి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారం పాటు జరిగే శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో సెలవు పెట్టకుండా అధికారులు అందరూ విధిగా పాల్గొనాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జరగబోయే కార్యక్రమంలో వివిధ శాఖల సంబంధిత అధికారులు వారి శాఖల ద్వారా జరిగే పథకాల గురించి వివరించాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఐకేపీ అధికారులు రామచంద్రం, మల్లీశ్వరి, మంజుల, స్వప్న, ఉపాధి హామీ అధికారులు మల్లమ్మ, కృష్ణమ్మ, మిషన్ భగీరథ అధికారి అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు

- కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మనోహరాబాద్



మనోహరాబాద్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మన్నె ధర్మేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా నర్సారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిట్కుల్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసిన వారికే నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

- బీసీ సెల్ అధ్యక్షులు అశోక్ గౌడ్
- జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్ గౌడ్


నవతెలంగాణ-నర్సాపూర్



గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసిన వారికే నామినేటెడ్ పదవులను ఇవ్వాలని బిసి సెల్ అధ్యక్షులు అశోక్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్ గౌడ్‌లు కోరారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎన్ని ఇబ్బందులు పెట్టినా కాంగ్రెస్ పార్టీని వీడకుండా కాంగ్రెస్ జెండా కోసమే పనిచేసి పార్టీ బలోపేతం కోసం పనిచేశామని వారు గుర్తు చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. రాజకీయ లబ్ది కోసం ఎన్నికల సమయంలో కొందరు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారని అటువంటి వారికి అవకాశం కల్పించవద్దన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేసిన వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నామినేటెడ్ పదవులు కేటాయించాలన్నారు. ఏది ఏమైనా ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు.

16న భారత్ బంద్ విజయవంతం చేయాలి

- కె మల్లేశం



నవతెలంగాణ-నిజాంపేట

ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త భారత్ బందును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 6న దేశవ్యాప్తంగా భారత్ బందు, నిరసన ర్యాలీలుచేపట్టడం జరుగుతుందన్నారు. నిత్యావసర సరుకులు, ఆహారవస్తులు, పెట్రోల్ డీజిల్ కిరోసిన్ వంటగ్యాసులపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో బడ్జెట్లో కోత విధిస్తూ ఉపాధి కూలీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఆహార భద్రత కార్డులలో నిర్లక్ష్యం వహిస్తున్నారని. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆహార భద్రత చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షులు రామస్వామి, నర్సింలు, నారా గౌడ్, దేవొల్ల అశోక్, రాజు, పాల్గొన్నారు.

16న దేశ వ్యాప్త కార్మిక సమ్మె

- గ్రామీణ భారత్ బంద్ ను జయప్రదం చేయాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త కార్మిక సమ్మెను, గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి తెలిపారు. మండల ఆశవర్కర్ల సంఘం సభ్యులతో కలిసి మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ సాయిసౌమ్యకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆశవర్కర్లు గత 18 సంవత్సరాల నుంచి పేద ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. గతంతో పోలిస్తే పని గంటలతో పాటు వారికి పనిభారం పెరిగినగాని ఆశాలకు పిక్సిడ్ వేతనాన్ని మాత్రం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించలేదని ఆయన మండిపడ్డారు. ఉదయం లేచిన దగ్గర నుంచి వారు పడుకునేంత వరకు కూడ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పనులు చేస్తూనే ఉంటారన్నారు. డెలివరీల సమయంలో తమ కుటుంబాలను సైతం వదిలిపెట్టి ఆసుపత్రుల చుట్టూ ఆశాలు పడిగాపులు పడుతూ గర్భిణీలకు సేవలందిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఇంతటి సేవలందిస్తున్న ఆశాలకు నెలకు రూ.26 వేల వేతనాన్ని ప్రభుత్వం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆశవర్కర్ల సంఘం మండల అధ్యక్షులు గోపమ్మ, కార్యదర్శి రేణుక, వెంకటలక్ష్మి, నర్మద, మంజుల, లక్ష్మీ, సబితా, భూలక్ష్మి, భాషమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



బాల్క సుమన్ ఖబర్దార్

- ప్రజలే చెప్పులతో కొట్టి తరుముతారు
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు
- అంబేద్కర్ చౌరస్తా వద్ద దిష్టిబొమ్మ దగ్ధం





నవతెలంగాణ-వెల్దుర్తి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై వెల్దుర్తి మండల కాంగ్రెస్ నేతలు నిప్పులు చెరిగారు. మంగళవారం మండల కేంద్రం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేతలు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లిలో జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ చెప్పు చూపెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద బాల్క సుమన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతాచారి, వేణుగోపాల్ రెడ్డి చావుకు బాల్క సుమనే కారణమని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే తెలంగాణలో తిరగనివ్వమని హెచ్చరించారు. రానున్న రోజుల్లో ప్రజలే చెప్పులతో కొట్టి, చెప్పుల దండ మెడలో వేసి ఊరేగిస్తారన్నారు. బాల్క సుమన్‌కు తప్పనిసరిగా బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పద్ద అధ్యక్షుడు మహేష్ రెడ్డి జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, హనుమేష్ వెంకట్ రెడ్డి, దుర్గా గౌడ్, పిఏసిఎస్ డైరెక్టర్ జగ్గా శంకర్ గౌడ్, కృష్ణ శ్రీనివాస్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి బయలుదేరారు.

నవతెలంగాణ-నార్సింగి

చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నార్సింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్క సుమన్ ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి పట్ల అలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్, శ్రీనివాస్ లతో పాటు టీజేఎస్ జిల్లా నాయకుడు కొండాపురం బాల రాజ్ గౌడ్, జప్తి శివనూర్ మాజీ ఉప సర్పంచ్ రుక్మొద్దీన్, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కేశవులు, మండల సోషల్ మీడియా కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సంతోష్, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ళ చిన్న కృష్ణా గౌడ్, మున్నూరు కాపు మాజీ అధ్యక్షుడు గజవెళ్ళి లక్ష్మి నర్సింహులు, ఫిషర్మన్ అధ్యక్షుడు సుధాకర్, పార్టీ నాయకుడు బొయిని ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

సిద్దిపేటకు భారీగా తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నార్సింగి

మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేపట్టిన చలో సిద్దిపేట కార్యక్రమానికి మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండల పరిధిలోని దుబ్బాక, మెదక్ నియోజకవర్గాల నుంచి మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బయలుదేరారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ల ఆదేశాల మేరకు మైనంపల్లి హన్మంతరావు చేపట్టిన చలో సిద్దిపేట కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి బయలుదేరుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్థాయి పీసీసీ నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గోవర్ధన్‌లతో పాటు టీజేఎస్ జిల్లా నాయకుడు కొండాపురం బాల్ రాజ్ గౌడ్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, బోయినీ ప్రభాకర్, లక్ష్మి నర్సింహులు, తాళ్ళ చిన్న కృష్ణా గౌడ్, ఎస్.కే రుక్మొద్దిన్, మండల పార్టీ కో ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి, మండల ఫిషర్మేన్ అధ్యక్షుడు సుధాకర, సంతోష్ తదితరులు భారీ ఎత్తున బయలుదేరారు.



ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-కౌడిపల్లి



ఆశా వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ 26 వేల జీతం అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు శ్యామల, చెన్నమ్మలు డిమాండ్ చేశారు. మంగళవారం ఆశాడే సందర్భంగా కౌడిపల్లి సిహెచ్‌సిలో డాక్టర్ ప్రవీణ్ కుమార్ కు వారు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16వ తేదీన సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్స్ గత 20 సంవత్సరాలుగా తమ సేవలు అందించిన ఆశా వర్కర్స్‌ను ప్రభుత్వం తక్కువ పారితోషికాలు చెల్లించి వెట్టి చాకిరీ చేయించుకుంటుందని ఆరోపించారు. ఆశా వర్కర్స్ చేసే పని నిరంతరం ప్రజలలో అన్ని వేళలా సేవలు అందిస్తారన్నారు. వర్కర్స్ పని భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. అర్హత ఉన్న ఆశలకు సెకండ్ ఏఎన్ఎంలుగా ప్రమోషన్ కల్పించాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నట్లు వారు తెలిపారు.16వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో మండలంలోని ఆశా వర్కర్స్ అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వసంత, మంజుల, మాధవి కవిత, నాయకులు లక్ష్మి చంద్రకళ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో పెరుగుతున్న దోమల బెడద

- దోమల మందు స్ప్రే చేయాలి

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలో దోమలు అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల వలన జనాలకు డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు ప్రభలే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. మోరీలలో నీరు నిల్వ ఉండడంతో దోమలు అధికంగా వచ్చి చేరుతున్నాయి డ్రైనేజీలలో మురికి నీరు ఉండడంతో విపరీతమైన దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమలకు మందును పిచికారి చేసినట్లయితే దోమలను నివారించవచ్చని గ్రామస్తులు పేర్కొన్నారు. సంవత్సరానికి ఒకటి రెండుసార్లు దోమల మందు స్ప్రే చేస్తున్నారు తప్ప, సరిగ్గా చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి వెంటనే దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భారీ కాన్వాయ్‌తో తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నిజాంపేట





మండల కేంద్రం నుంచి సిద్దిపేటకు కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ఎత్తున కార్లలో బయలుదేరి వెళ్లారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సిద్దిపేటకు వస్తున్న సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించి సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం తీసుకురానున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సిద్దిపేట నియోజకవర్గంలో పూర్తిగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఉద్దేశంతో రోడ్ షో చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహేందర్, మండల అధ్యక్షుడు మారుతి, పట్టణ అధ్యక్షుడు నసిరుద్దీన్, ఎంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, మండల సేవాదళ్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అందే స్వామి, నందిగామ మాజీ సర్పంచ్ ఆకుల బాలయ్య కాకి రాజయ్య, రావిపల్లి మహేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, , లక్ష్మా గౌడ్, జేల్లా రాజా గౌడ్, మోహన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, బోయిన చంద్రం, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్, శ్రీకాంత్ గౌడ్, జక్కుర్ రాజు ,విట్టల్, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర భారతికి వెళ్లిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలో అన్నీ ప్రభుత్వ రంగ సంస్థలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పాత్ర కీలకమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ రంగాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. సిద్దిపేట నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగా శ్రమించి, విధులు చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకి సరైన గుర్తింపు లేదన్నారు. పలు సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గుర్తించి, తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజమల్లు, రాజేష్, రాంచందర్, అరుణ్ కుమార్, మహేందర్, రజిత, సంతోష్ కుమార్, కపిల్, స్వామి, ప్రకాష్, రవి కుమార్, ప్రవీణ్ కుమార్, నాగరాజు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రామా పోటీలలో దుద్దెడ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కొండపాక

ప్రభుత్వ పాఠశాలల మండల స్థాయి ఇంగ్లీష్ సబ్జెక్టుపై నిర్వహించిన స్పెల్ విజార్డ్ డ్రామా పోటీల్లో దుద్దెడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తెలిపారు. ఈ నెల 13న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు డ్రామా పోటీలకు ఎన్నికైన 9వ తరగతి విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రబాను, యాదగిరి, కిరణ్మయి, రజిని, లక్ష్మణరావు, రాధాకృష్ణ, శ్రీదేవి, భారతి, అరుణ, ఉమారాణి, హైమావతి, జానకి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించడం హర్షనీయం

- తహసీల్ వద్ద పలువురు గూడెం గ్రామస్తుల ఆనందం
- గ్రామాభివృద్ధికి స్థలం కేటాయించాలని తహసిల్దారుకు వినతి



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను ప్రభుత్వాధికారులు తొలగించడం హర్షనీయమని పలువురు గూడెం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసిల్ వద్ద తహశీల్దార్ ఎర్రోల్ల శ్యామ్‌కు పలువురు గూడెం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గూడెం గ్రామ శివారులోని 321 సర్వే నంబర్ యందు అక్రమ నిర్మాణాలను తొలగించిన అధికారులు ప్రభుత్వ అభివృద్ధి పనులకు, అర్హులైన నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు స్థలం కేటాయించాలని తహశీల్దార్‌కు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల వినతులను నివేదిక రూపొందించి జిల్లా పరిపాలనాధికారికి అందజేస్తానని.. గ్రామంలో నిలిచిన ప్రభుత్వ అభివృద్ధి పనుల జాబితాను గ్రామ ప్రత్యేకాధికారికి అందజేయాలని తహశీల్దార్ శ్యామ్ గ్రామస్తులకు సూచించారు.

అర్హులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి



గతంలో గ్రామంలో పలువురికి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించింది. ఆ కేటాయింపులను కొందరు ఆసరగా చేసుకుని అదనంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి పశువుల, గొర్రెల పాకలను అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వాధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించడం హర్షనీయం. గ్రామంలో ఇళ్లు లేని పలువురు నిరుపేదలున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలకు తావులేకుండా మరికొందరికి ఇళ్ల నిర్మాణానికి స్థలాన్ని పారదర్శకంగా కేటాయించాలి.

గూడెల్లి లక్ష్మణ్, మాజీ సర్పంచ్, గూడెం

జనం చీత్కరించినా బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదు



నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలు తిరస్కరించి ఎన్నికల్లో ఓడించినా బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రాలేదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఫ్లెక్సీని దగ్ధం చేశారు. అనంతరం దేవులపల్లి యాదగిరి మాట్లాడాతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే గులాబీ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. ఫ్రస్టేషన్లో ఏది పడితే అది మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వాన్ని విమర్శించే నేతలను తన్ని తరిమేసే పరిస్థితి తెచ్చుకోవద్దని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ మాటలను ప్రజలు పట్టించుకోవద్దన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అండ్ టీం ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని సూచించారు. రెచ్చగొట్టే మాటల ద్వారా తమను అభాసుపాలు చేయాలని చూస్తున్నారన్నారు. ఆకాశం మీద ఉమ్మాలని చూస్తున్న వారికి వారి మీదనే పడుతున్న సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతి మొత్తం బయటకు వస్తుందనే గులాబీ నేతలు విద్వేషం, విషం చిమ్మే పనులు చేస్తున్నారని, వారిపై తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. కేటీఆర్ మాటలతోనే బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో ఓడించారని.. ఇప్పటికైనా కేటీఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెలికాని యాదగిరి, గోనెపల్లి శివ, బాగు శ్రీకాంత్, రాగుల కృష్ణ, జంగిటి శ్రీనివాస్, దాసరి కిషన్, గౌరబోయిన సంపత్, రాగుల కనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, చేర్యాల బాలయ్య, బండారి రాజు, బస్వరాజు రాములు, తుపాకుల శ్రీనివాస్, అనరాజు ఎక్కరాజు, శివరాత్రి తిరుపతి, దేవులపల్లి చింటు,గొట్టం రంగారెడ్డి, కొనాయిపల్లి రాజు, బంగారు నర్సింలు, రజినీకాంత్, చిలుక శేఖర్ రెడ్డి, బడె సాంబయ్య, పాపిగారి లక్ష్మణ్, చింతల సత్తయ్య, హరీష్, ద్యాగల రాజు, పుల్లూరి రవి, పిల్లి నర్సింలు, గొనె పల్లి రాజు, దువ్వల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఘనంగా వీడ్కోలు వేడుకలు

- ద్యాన్సులతో హోరెత్తించిన విద్యార్థినులు



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రెండవ సంవత్సరం విద్యార్థులకు ఫేర్వెల్ పార్టీని నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులందరు ఉన్నత చదువులు చదవాలని, చదవడానికి డబ్బులు లేక ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తనవంతు సహాయం చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు ఆడి పాడి ఉల్లాసంగా గడిపారు. వివిధ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. విద్యార్థుల కేరింతలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ఇంతకాలం కలిసిమెలిసి గడిపిన క్షణాలను గుర్తుచేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి రాజు, ఎమ్ లక్ష్మీనారాయణ, ఎస్ దాయనంద్, ఎమ్ సంపత్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, శివకుమార్, మంత నాయక్, భాగ్యమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కవులు కళాకారులకు నిజమైన గౌరవం దక్కింది



నవతెలంగాణ-కొమురవెల్లి

కాంగెగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కవులు కళాకారులకు నిజమైన గౌరవం దక్కిందని తెలంగాణ ఉద్యమ గాయకుడు, సాంస్కృతిక సారథి, కళాకారుడు పిన్నింటి రత్నం స్పష్టం చేశారు. మంగళవారం కొమురవెల్లి మండల కేంద్రంలో పిన్నింటి రత్నం కళాకారుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ, జననీ జయకేతనం ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం అంటూ తెలంగాణ యావత్ జనాన్ని ఉద్యమ స్ఫూర్తిని రగిలించి దీప్తినందించిన స్ఫూర్తిదాయకమైన గీతాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం తెలంగాణ కవులను కళాకారులను గౌరవించినట్లేనని హర్షం వ్యక్తం చేశారు. గీత రచయిత ప్రజాకవి ప్రజా వాగ్గేయ కారులు డాక్టర్ అందెశ్రీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజా అభిప్రాయాన్ని తన కలం గళం ద్వారా తెలంగాణ ప్రజలను ఏకతాటిపై తెచ్చి చైతన్యం నింపిన ఘనత అందెశ్రీకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవులు, కళాకారుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గట్టుగల్ల సంజీవ, జనగామ శంకర్, బానోత్ గణేష్, కేమిడి కనుకరాజు, పన్నీరు శ్రీనివాస్, కారుపోతుల సోమయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిని కలిసిన గజ్వేల్ లయన్స్ క్లబ్ సభ్యులు

- లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ కరపత్రం విడుదల





నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

మెగాస్టార్ చిరంజీవిని గజ్వేల్ లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గూడాల రాధాకృష్ణ, సంజయ్ గుప్తాలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ కరపత్రాన్ని చిరంజీవి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమా, రాజకీయ, సామాజిక సేవలు తన ఉదార స్వభావాన్ని మెగాస్టార్ చిరంజీవి చాటుకున్నారన్నారు. బ్లడ్ బ్యాంక్ ద్వారా ఆపదలో ఉన్న వేల ప్రాణాలకు జీవం పోసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇటీవల పద్మ విభీషణ్ అవార్డు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఒక సినిమా రంగంలోనే కాకుండా అన్ని విషయాల్లో మెగాస్టార్ అనిపించుకున్న ఏకైక వ్యక్తి చిరంజీవి అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 10న లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే కరపత్రాన్ని ఆవిష్కరించామన్నారు. ప్రపంచానికి మెగాస్టార్ చేసిన సేవలు, సినిమాలు, కళ్లకు కట్టినట్లుగా నూతన మెసేజ్‌తో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

సీఎంను విమర్శించే స్థాయి సుమన్‌కు లేదు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య



నవతెలంగాణ-కోహెడ

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చిత్రపటానికి పాదరక్షకాలతో దండ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిని చెప్పుతో కొడతానని మాట్లాడడం సమంజసం కాదని , బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, గొరిట్యాల లక్ష్మణ్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు బందెల బాలకిషన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూలం శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చింతకింది శంకర్, మైనార్టీ మండల అధ్యక్షుడు అంకూస్, గ్రామశాఖ అధ్యక్షుడు ముంజ తిరుపతి, ఎస్సీసెల్ ఉపాధ్యాక్షుడు గూడ స్వామి, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సనత్‌రెడ్డి, నాయకులు ప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, బైరి సుధాకర్, కరివేద చంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, ముంజ శివ, తూటి చంద్రారెడ్డి, చెప్యాల రవీందర్, చాంద్‌బాయ్, పద్మారెడ్డి, బొబ్బల కనకారెడ్డి, చిగురు కొమురయ్య లింగాల కుమార్, గర్రెపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన మురళి

- మర్యాదపూర్వకంగా సిపి డాక్టర్ అనురాధను కలిసిన సీఐ



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్: గజ్వేల్ నూతన ట్రాఫిక్ సీఐ (సర్కిల్ ఇన్స్పెక్టర్)గా మరిపాక మురళి పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సీఐ మురళికి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరం, చట్ట ప్రకారం నేరమని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపేవారు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్కు చేసుకోవాలని, రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కు చేయవద్దని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి నిధుల మంజూరికి కృషి చేస్తా

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీని వాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

పెద్దమ్మ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.10 లక్షల మంజూరుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీని వాస్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం నాయకులు దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామంలో గల ముదిరాజ్‌ల కుల దైవం పెద్దమ్మ తల్లి దేవాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మా ణం కోసం సహకరించాలని కోరారు. ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశామన్నారు. శ్రీనివాస్ రెడ్డి స్పందించి పెద్దమ్మ తల్లి దేవాలయం ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి సానుకూలంగా స్పందించిన శ్రీనివాస్ రెడ్డికి ముదిరాజ్ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు అక్కం స్వామి, తుక్కాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ చెరుకు విజయ్ రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉల్లెంగల సాయి కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయ కులు లింగాల కృష్ణ, వెంకటి, ఉప్పలయ్య, స్వామి గ్రామ పార్టీ అధ్యక్షుడు బర్రెంకల స్వామి, చిక్కుడు స్వామి, చిక్కుడు భాస్కర్, మాష్టీ యాదయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్.. నువ్వే కేసీఆర్ తొత్తు

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కనకయ్య గౌడ్



నవతెలంగాణ-మర్కుక్

బాల్క సుమన్ నువ్వే బచ్చావు, కేసీఆర్‌కు తొత్తువు, బీఆర్ఎస్ ఓటమితో స్పృహ కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నావ్, సిఎం రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటావని కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఓటమితో స్పృహ కోల్పోయి నోరు పారేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులకు రాబోయే రోజుల్లో ప్రజలే చెప్పు దెబ్బల రుచి చూపిస్తారని హెచ్చరించారు. బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజల మధ్య తిరగనివ్వమని హెచ్చరించారు. ప్రజల ఆశీర్వాదంతో రేవంత్ రెడ్డి సిఎంగా ప్రమాణం చేసి ప్రజా రంజకమైన పాలన అందిస్తున్నారన్నారు. దాన్ని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు వాగితే కాంగ్రెస్ శ్రేణులు చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదన్నారు. సీఎంను చెప్పుతో కొడతానన్న బాల్క సుమన్ మాటలు వెనక్కి తీసుకోవాలన్నారు. ఉద్యమకారుడివి కావని కేసీఆర్ కుటుంబానికి బానిసవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఒడిదొడుకులను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్ది రాష్ట్ర ప్రజలకు కానుకగా ఇవ్వబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, పాతూరు తాజా మాజీ సర్పంచ్ అరుణ నర్సింలు, పాములపర్తి ఉపసర్పంచ్ పద్మా నర్సింలు, నాయకులు చంద్రం, క్రాంతి కిరణ్ తదితరులున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వంటేరు



నవతెలంగాణ-గజ్వేల్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మొదటి వార్డులో వెంకటేష్ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకొని మంగళవారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలు పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంత రెడ్డి, రాజా గౌడ్, గణేష్ గౌడ్, అశోక్ గౌడ్, అంజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం టీఏఈఓఎస్ సిద్దిపేట జిల్లా డైరీ, టేబుల్ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, ఏడిఏ పద్మ, తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ (టీఏడీఏ) కోశాధికారి పరశు రాం, తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షులు అశోక్, కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి ప్రేమ్ సాయి, సహాయధ్యక్షులు విజయ్, జిల్లా కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-కొండపాక

కుకునూరు పల్లి మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మిట్టపల్లి వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మిట్టపల్లి వసంత రుషి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.8 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అగుల్ల శ్రీశైలం, ఎల్లేశం, సాయిలు, పెద్ద ఎల్లేశంలు ఉన్నారు

ప్రయాణ ప్రాంగణంలో పంచాయతీలు

- మండల కేంద్రంలో ప్రయాణ ప్రాంగణం దుస్థితి



నవతెలంగాణ-బెజ్జంకి

లక్షలు వెచ్చించి నిర్మించి..రంగు రంగులతో సుందరంగా తీర్చిదిద్దిన ఆర్టీసీ ప్రయాణం ప్రాంగణం ప్రయాణీకుల్లేక వెలవెలబోతుంది. పలువురు పంచాయతీదారులు ప్రాంగణాన్ని ఆసరాగా చేసుకుని వారి నిర్ణయాలకు అడ్డగా మార్చుకుంటున్నారు. గతంలో అధ్వానస్థితిలో ఉన్న ప్రయాణ ప్రాంగణాన్ని ఆర్టీసీ అధికారులు గత కొద్ది నెలల క్రితం సుందరీకరణ చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. పంచాయతీదారులకు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం వేదికవ్వడంతోనే ప్రయాణీకులు ప్రాంగణంలోకి వేళ్లేందుకు ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబధిత ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ చూపి పంచాయతీలకు నిలయంగా మారిన ప్రయాణ ప్రాంగణాన్ని ప్రయాణీకులకు వినియోగమయ్యేలా సత్వర చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సింగరాయ జాతరకు పటిష్ట బందోబస్తు

- సీఐ ఎర్రల కిరణ్



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని కూరెళ్ళ, తంగళ్ళపల్లి గ్రామాల మధ్య గల శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మినరసింహస్వామి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ తెలిపారు. ఈ నెల 9న జరగనున్న జాతర సందర్భంగా ఆలయ ఆవరణ పరిసరాలు, క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాలు, జాతరకు వెళ్ళే దారులు, స్నాన ఘట్టాలు, వాగు ఏరియా ప్రదేశాలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రశాంతంగా జాతర జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై సిహెచ్.తిరుపతి, కానిస్టేబుల్‌లు కనకయ్య, రమేష్‌లు ఉన్నారు.

సామిల్ టింబర్ డిపో సంఘం అధ్యక్షుడిగా బాల్ రాజు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట రేంజు టేకు సామిల్ టింబర్ డిపో సంఘం అధ్యక్షులుగా బాల్ రాజు, గౌరవ అధ్యక్షునిగా కయూము ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షు లుగా సాయన్న గారి సుందర్, కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి, కోశాధికారిగా రామచంద్రం, సలహాదారులుగా రాజన్న, బాపురెడ్డి, సత్యనారాయణలు ఎన్నికయ్యారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి



నవతెలంగాణ-నంగునూరు

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని పంచాయతీ కార్యదర్శి చంద్రకళ ఆదేశించారు. మంగళవారం నంగునూరు గ్రామపంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో హోటల్స్, కిరాణా షాపుల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ గ్లాసులు ఉపయోగించరాదని స్టీల్ గ్లాసులు, స్టీల్ ప్లేట్లు, గాజు గ్లాసులు మాత్రమే ఉపయోగించాలని హోటల్, వర్తక యజమానులకు అవగాహన కల్పించారు. ఆమెతో పాటు కారోబార్ వెంకటనర్సు, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న బాల్క సుమన్



నవతెలంగాణ-కొండపాక

ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించడంతో స్పృహ కోల్పోయి బాల్క సుమన్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, కుకునూరుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. సుమన్ నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ప్రజల కోసం పనిచేస్తున్న రేవంత్ రెడ్డి పాలనను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. అలాంటి చిల్లర మాటలు మాట్లాడితే సహించేది లేదని పేర్కొన్నారు.

సిద్దిపేట జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్

- తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి.



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావులకు దక్కుతుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ప్రజలకు సాగునీరు, త్రాగునీరు అందించడానికి కొండపోచమ్మ సాగర్ మల్లన్న సాగర్ రంగనాయక సాగర్‌లాంటి ప్రాజెక్టుల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేసి సిద్దిపేట జిల్లా రైతంగానికి త్రాగు, సాగునీరు అందించిన ఘనత కేసీఆర్, హరీష్ రావులకు దక్కిందన్నారు. సిద్దిపేట జిల్లా తెలంగాణ రాష్ట్రానికి మోడల్ గా ఉందన్నారు. సిద్దిపేట జిల్లాలో నూతన కలెక్టరేట్ భవనం, అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్ట్ కళాశాల, మెడికల్ కళాశాల, పరిపాలన సౌలభ్య భవనాలు విశాలమైన రోడ్లు నిర్మించి గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించారన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలో 16 స్థానాలను బి ఆర్ ఎస్ పార్టీ గెలుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలతో పాటు 6 గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు, రైతులు రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారన్నారు, మీరు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు నవాజ్ , ఇక్బాల్, శ్రీనివాస్, బిక్షపతి, నరేష్, కుమార్, పోచయ్య ప్రకాష్, అఖిల్, బాకీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

మృతుని కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. మంగళవారం మండలం లోని తుక్కాపూర్ గ్రామంలో తుర్క కాశీంలు మదర్ సాబ్ హుస్సేన్ కొడుకు మృతి చెందాడు. విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. అనంతరం కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తుక్కాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి, ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షునిగా కమలాకర్



నవతెలంగాణ-మద్దూరు : జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన చెట్క్యారి కమలాకర్ యాదవ్‌ను రాష్ట్ర యూత్ అధ్యక్షుడు శివసేనారెడ్డి నియమించారు. మంగళవారం జనగామ డిసిసి అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గం అధ్యక్షునిగా కమలాకర్ యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమలాకర్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షునిగా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించిన జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, మద్దూరు జెడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు, సహకరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ దుకాణాల్లో సామాజిక తనిఖీలు

నవతెలంగాణ-బెజ్జంకి



మండలంలోని అయా గ్రామాల్లో భినామి పేర్లతో ఎవరైనా రేషన్ దుకాణాలను నిర్వహిస్తున్నారా? అనే ప్రధాన అంశంగా సంబంధిత అధికారులు సామాజిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు రేగులపల్లి, చీలాపూర్, దాచారం గ్రామాల్లోని పలు రేషన్ దుకాణాల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ అదేశానుసారం పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ ఎండీ.జైనుల్ ఆభిదీన్ సామాజిక తనిఖీలు నిర్వహించారు. బియ్యం పంపిణీలో సాంకేతిక, తూకాలు, రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరాలో ఎమైనా సమస్యలు తలెత్తుతున్నాయా అనే అంశాలపై ప్రత్యేకంగా వివరాలు సేకరించినట్టు ఆభిదీన్ తెలిపారు. తనిఖీల్లో ఆర్ఐ సుహసిని, అయా గ్రామాల రేషన్ డీలర్లు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, వినియోగదారులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే కేసుల కొట్టివేత

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి హర్షం

నవ తెలంగాణ-గజ్వేల్



పోరాటాల ఫలితంగానే మల్లన్న సాగర్ భూనిర్వాసితులపై పెట్టిన కేసులు కొట్టివేశారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. 2016 సంవత్సరంలో మల్లన్న సాగర్ నిర్వాసితులు భూసేకరణ కు వ్యతిరేకంగా నిర్వాసితులు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా సీపీఐ (ఎం) పార్టీ, ఇతర రాజకీయ పార్టీల, నిర్వాసిత గ్రామ నాయకులైన అజ్జమర్రి మల్లేశం, గొల్లపల్లి జయరాజు, గొడ్డుబర్ల భాస్కర్, వంటేరు ప్రతాపరెడ్డి, ఎండి హయితోద్దీన్, ఎర్రన్న గారి శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, తిప్పారం కనకయ్య, వెల్ల విజయ్, గాల్ రెడ్డి, వర్ధన్న నరసింహారెడ్డి, గాండ్ల పాండు, బాతుల శ్రీనివాస్, కమ్మ సత్తిరెడ్డి, నక్క స్వామి, మునిగడప ప్రశాంత్, ఎర్రన్న గారి కన్నా రెడ్డి, ఎర్రన్న గారి పురుషోత్తమ్ రెడ్డి లపైఅప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం లాఠీ చార్జీలు, కాల్పులు జరిపి, అక్రమ కేసులు బనాయించి నాయకులను జైలుకు పంపారని ఆయన గుర్తు చేశారు. కేసుల కోసం గత ఎనిమిది సంవత్సరాలుగా సిద్దిపేట జిల్లా కోర్టు చుట్టూ తిరుగుతూ చివరకు కేసులు కొట్టివేశారని ఈ తీర్పు అప్పటి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. నిర్వాసిత కుటుంబానికి న్యాయం జరిగే విధంగా తొందరగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో నిర్వాసితుల మద్దతుతో మరో పోరాటం చేసి సాధించుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవతెలంగాణ-సిద్ధిపేట కలెక్టరేట్



ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమా అగ్రవాల్, జిల్లా గ్రామిణాబివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా, జిల్లా పంచాయతీ అధికారి దేవకి దేవి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమేష్, మిషన్ భగీరథ ఎస్ఇ శ్రీనివాస్ చారి తో కలిసి ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులుగా విధులు నిర్వర్తించే అధికారులు జవాబుదారితనంతో వ్యవహరించాలన్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధిలో భాగంగా పారిశుద్ధ్యం, నర్సరీ, త్రాగునీరు, విద్యుద్దీపాలు, మురుగుకాలువలు, అంతర్గత రహదారుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో గ్రామపంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా 7 నుండి 14 రోజుల పాటు చేయాల్సిన అంశాలను వివరించారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే

మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

నవ తెలంగాణ-సిద్దిపేట



మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు అన్నారు. పట్టణ స్వచ్ఛ బడిలో భాగంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర నేషనల్ గ్రీన్ క్రాప్స్ వారు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు లైఫ్..లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ అను కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు మనిషి నిత్యజీవితంలో ప్లాస్టిక్ ఒక భాగం అయ్యిందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని మనుషులు ఎంత తగ్గిస్తే అంత సంతోషంగా ఉంటారన్నారు. పట్టణంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్లాస్టిక్ రహిత పట్టణంగా తయారు చేశారన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన వచ్చే అనారోగ్యాలను ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. సిద్దిపేట జిల్లాలోని 30 ప్రభుత్వ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొనగా ఎన్ జీ సీ ప్రాజెక్ట్ అధికారి రాజశేఖర్ విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ గోపాలపురం దీప్తి నాగరాజు, పాఠశాలల ఉపాధ్యాయులు, ఎన్‌జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ మినీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవ తెలంగాణ-మద్దూరు



మండలంలోని మర్మముల గ్రామంలో మద్దూరు ఏపీజీవీబీ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ బ్యాంకులో పాస్ బుక్ ప్రింటింగ్ సేవలను బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్‌తో కలిసి వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ఏపీజీవీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా హైరిక్స్ ఇంచార్జ్ శంకర్, కో ఆప్షన్ మెంబర్ జిలాని,తాజా మాజీ సర్పంచ్ సుందరగిరి స్రవంతి పరిసరాములు గౌడ్, బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మంద సుమన్, మినీ బ్యాంక్ నిర్వాహకురాలు మంద భార్గవి, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



నవ తెలంగాణ-మద్దూరు : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం స్వయం సపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు బోధనలు చేశారు. డీఈవోగా హరీష్, ప్రధానోపాధ్యాయులుగా సాగర్, ఉపాధ్యాయులుగా భాను, చరణ్, శివాని, శ్రుతి, సాత్విక, ఐశ్వర్య రమ్య, రోహిత్, కౌశిక్, నందకిషోర్, సందీప్, అరవింద్, జేమ్స్, గణేష్, రాహుల్, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంఈఓ మొగుళ్ళ నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ తోటి చదువుకున్న విద్యార్థులకు ఉపాధ్యాయులుగా మారి విద్యాబుద్ధులు చెప్పడం ఒక అనుభూతి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ సర్వర్, మోహియోద్దీన్, కాజా, ముజీతయుద్దీన్, శ్రీనివాస్, కార్తీక్, రామకృష్ణ, జావిదా సుల్తానా, రజిని, స్వర్ణకుమార్, వకీల్, సంపత్, రాకేష్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు

పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి : మండల పరిధిలోని గూడెం గ్రామ శివారులోని సర్వే నంబర్ 321 యందు అక్రమ నిర్మాణాలను తొలగించి స్వాధీనం చేసుకున్న భూమిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని మాజీ సర్పంచ్ హన్మండ్ల లక్ష్మారెడ్డి కోరారు. అధికారులు గ్రామంలోని ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు కేటాయించాలని పరిపాలనాధికారిని కోరారు. పరిపాలనాధికారి స్పందించి ఆర్డీఓకు అందజేయాలని సూచించడంతో హుస్నాబాద్ లోని ఆర్డీఓ కార్యాలయంలో సిబ్బందికి అందజేశామన్నారు. ప్రభుత్వాధికారులు ప్రత్యేక చొరవ చూపి నిరుపేదలకు న్యాయం చేయాలని లక్ష్మారెడ్డి కోరారు. యాలాల పర్శరాములు, బోనాల రమేష్, మంకాల బాబు, హన్మడ్ల తిరుపతి రెడ్డి,గూడెల్లి కొమురయ్య, నూనె రవి,మాంకాల నగేష్, మాంకాల శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కోహెడ



మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సురేఖకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెంబర్ 1306లో 5 ఎకరాల 20 గుంటలు, సర్వే నెంబర్ 1307లో 4 ఎకరాల 27 గుంటల భూమిని ఫ్యాక్స్ ఛైర్మన్ పేర్యాల దెవేందర్‌రావు కబ్జా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఆ భూమిలో ఉండే బండ రాళ్ళను బ్లాస్టింగ్ చేసి చదును చేసేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో చుట్టు ప్రక్కల ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి, ఎంపీడీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, రైతు వేదిక భవనాలు ప్రకంపనలకు దెబ్బతింటున్నాయన్నారు. జెసీబీలతో చదును చేస్తున్నారని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారి నుంచి కాపాడాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, గొరిట్యాల లక్ష్మణ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు భీంరెడ్డి తిరుపతిరెడ్డి, బందెల బాలకిషన్, మంద కిష్టయ్య, అర్శనపల్లి జయకృష్ణ, చుక్క అశోక్, గోవిందు రమేష్, ఎస్సీసెల్ ఉపాధ్యాక్షుడు గూడ స్వామి, సోషల్‌మీడియా కో ఆర్డీనేటర్ మహ్మద్ అబ్దుల్ రఫీ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఎడ్ల రాంచంద్రం, దానవేని వెంకటస్వామి, సదానందం, చుక్క శంకర్, కిట్టు, తదితరులు పాల్గొన్నారు. దీంతో ఫ్యాక్స్ ఛైర్మన్ పెర్యాల దెవేందర్‌రావును చరవాణిలో సంప్రదించగా ఈ విధంగా స్పందించారు.

ఎలాంటి విచారణకైన సిద్ధం

- ఫ్యాక్స్ ఛైర్మన్ పెర్యాల దెవేందర్‌రావు



రాజకీయ కక్ష సాధింపు చర్యతోనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి బెదిరింపులు సరైనవి కావు. తనకు గతంలోనే ఈ భూమి సంక్రమించింది. అలాగే ఎలాంటి విచారణకైనా తాను సిద్ధంగా ఉన్నాను. అధికారంలో ఉన్నామనే అహంతోనే కాంగ్రెస్ నాయకులు ఇలా రెచ్చగొడుతున్నారు. ఇలాంటి రాజకీయాలు చేయడం మానుకోవాలి. అలాగే తాను పరువునష్టం దావా వెసేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇట్టి భూమిపై సమగ్ర విచారణ జరిపించేందుకు తనకు ఎలాంటి సందేహం లేదు.

మల్లన్నసాగర్‌ను సందర్శించిన కర్ణాటక ఎమ్మెల్యేల బృందం

విజిట్ టు ప్రాజెక్ట్‌లో భాగంగా ఆర్థిక శాఖ నిపుణుల కమిటీ పర్యటన

ఎమ్మెల్యేలకు ప్రాజెక్టు వివరాలు తెలిపిన ఈఎన్సీ హరిరామ్

నవతెలంగాణ-తొగుట



విజిట్ టు ప్రాజెక్ట్‌లో భాగంగా ఎక్స్పెండిచర్ ఆర్థిక శాఖ నిపుణుల కమిటీ సభ్యులు మంగళవారం పర్యటించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్థిక శాఖ నిపుణుల కమిటీ పర్యటన సభ్యులైన 12 మంది ఎమ్మెల్యేలు మండలంలోని తుక్కాపూర్ గ్రామ సమీపంలోని గల మల్లన్న సాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఎమ్మెల్యేల బృందానికి ఈఎన్సీ హరిరామ్ ప్రాజెక్టు కట్టడం మొదలు నుంచి ప్రాజెక్టులో వివిధ దశలలో పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిట్ టు ప్రాజెక్ష్‌లో భాగంగా, ఎమ్మెల్యేలు తొలుత సిద్దిపేటలోని రంగనాయక సాగర్, అనంతరం మల్లన్న సాగర్ ప్రాజెక్టును సందర్శించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆధారంగా అభివృద్ధి చేసిన వ్యవసాయం, తాగునీటి వ్యవస్థ కోసం తెలంగాణలో లబ్ధి పొందిన ప్రాజెక్టు నిర్మాణం చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వివిధ భాగాలను వివరిం చామన్నారు. చైన్ ఆఫ్ ట్యాంకుల వ్యవస్థ కింద మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను నింపేందుకు, ఆ నీటిని వినియోగం కోసం ప్రాజెక్ట్ యొక్క ప్రణాళిక, రూపకల్పనతో పాటు పెద్ద ప్రాజెక్టు నిర్మాణంలో అవలంబించిన నిర్మాణ చేపట్టినట్లు చెప్పారు. నిర్మాణం పద్దతితో పాటు ప్రతి దశలో వివిధ ఇతర విభాగాల ప్రమేయం గురించి బృందం సభ్యులకు వివరించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేల వెంట ఎస్ఈ బస్వరాజ్, ఈఈ సాయి బాబు, వెంకటేశ్వర్‌రావు, ఇంజినీర్లు, తదితరులు ఉన్నారు.

జిల్లాలో పర్యటించనున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల బృందం : జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవతెలంగాణ-సిద్ధిపేట కలెక్టరేట్

జిల్లాలో ఎంసీఆర్ హెచ్‌ఆర్ డి నుండి కేంద్ర ప్రభుత్వ సెక్టోరియల్ లెవల్-డి 15మంది ఉద్యోగుల బృందం పర్యటించనుందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ తెలిపారు. జిల్లాలో పర్యటించనున్న నేపద్యంలో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ సెక్టోరియల్ లెవల్-డి 15మంది ఉద్యోగుల బృందం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమా అగ్రవాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలో వారి టూర్ షెడ్యూల్‌ను తెలిపారు. జిల్లాలో అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు ప్రక్రియ గూర్చి నేరుగా ప్రజల వద్దనుండి తెలుసుకుని వారి అభిప్రాయాలను డాక్యుమెంట్ రూపంలో నిక్షిప్తం చేయడం జరుగుతుందని బృంద సభ్యులు కలెక్టర్‌కు తెలిపారు. జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న పథకాలను గుర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమేష్, డిఆర్డిఎ పిడి జయదేవ్ ఆర్యా మరియు పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి హన్మంతరావుకు ఘన స్వాగతం

వందల సంఖ్యలో భారీ కాన్వాయ్

గజమాలతో ఘనస్వాగతం

నవతెలంగాణ-మనోహరాబాద్



మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్‌కు మెదక్ జిల్లా ప్రారంభంలోని కాళ్ళాకల్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఛలో సిద్దిపేట కార్యక్రమంలో భాగంగా మైనంపల్లి హన్మంతరావ్ సిద్దిపేటకు భారీ కాన్వాయ్‌తో బయలు దేరారు. మంగళవారం మధ్యాహ్నం మెదక్ జిల్లా ప్రారంభంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిట్కుల్ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ క్రేన్ సహాయంతో గజమాల సత్కరించి ఘన స్వాగతం పల్లికారు. అనంతరం బాజా భజంత్రీలతో హన్మంతరావ్ స్థానిక బంగారమ్మ దేవాలయానికి చేరుకొని వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మైనంపల్లి హన్మంతరావ్ కాన్వాయ్‌లో వందల సంఖ్యలో వాహనాలు ఉండడంతో జాతీయ రహదారి పూర్తిగా దిగ్భందంగా మారిపోయింది. ఇరు వైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం ర్యాలీ జాతీయ రహదారిపై తూప్రాన్ మీదుగా బయలుదేరింది. తూప్రాన్‌లో సంత కావడంతో భారీ ఎత్తున వాహనాలు కాన్వాయ్‌గా రావడంతో ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలిపోయారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ దీపాదాస్ మున్షిజి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, గజ్వెల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా యువజన నాయకురాలు ఆంక్షారెడ్డి, నాయకులు కావేరిగారి వెంకట్‌రెడ్డితో పాటు అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ -గజ్వేల్

మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైలంపల్లి హనుమంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ రావు కు గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్‌కు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి నాయకత్వంలో సిద్ధిపేటలో జరిగే కార్యకర్తల సమావేశానికి భారీ సంఖ్యలో తరలివెళ్లారు. గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ నుండి కొండపాక దుద్దడ వరకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. వందలాది కారుల కాన్వయతో మైనంపల్లి సిద్ధిపేటకు తల్లి వెళ్లారు. గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో క్రేన్ ద్వారా మైనంపల్లి కుటుంబ సభ్యులకు పూలమాల వేశారు. అదేవిధంగా మెదక్ పార్లమెంట్ స్థానం మైనంపల్లికి కేటాయించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, మల్లారెడ్డి, సర్దార్ ఖాన్, నక్క రాములు, మామిడి కృష్ణ, రాజు, వహీద్ తదితరులున్నారు.



శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

నవ తెలంగాణ-మిరుదొడ్డి



శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎస్సై రాజేశం అన్నారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై నరేష్ పాపన్నపేటకు బదిలీ కావడంతో ఉన్నతాధికారులు రాజేశంకు మిరుదొడ్డి ఎస్సైగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేశం మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

లక్ష్మీపూర్ టూ కరీంనగర్

జిల్లాలు దాటీ యథేచ్ఛగా మట్టి

అక్రమ రవాణ

చోద్యం చూస్తున్న అధికారులు

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని లక్ష్మీపూర్ టూ కరీంనగర్ జిల్లా కేంద్రానికి రేయింబవళ్ళ ఎర్ర మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు రవాణదారులు. మండలంలోని మట్టిని రవాణదారులు యథేచ్ఛగా జిల్లాలు దాటిస్తుండడంతో అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. సంబధిత అధికారులు చోద్యం చూడడంతోనే మండలంలోని మట్టి గత కొద్ది రోజులుగా యథేచ్ఛగా తరలిపోతోందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చోద్యం చూడకుండా చట్టపరమైన సత్వర చర్యలు చేపట్టాలని యువజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

బాల్క సుమన్‌పై పోలీసులకు ఫిర్యాదు



నవ తెలంగాణ-దుబ్బాక

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై మంగళవారం కాంగ్రెస్ నాయకులు దుబ్బాక పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పై అనిచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ దుబ్బాక మున్సిపల్,మండల అధ్యక్షులు నర్మెట ఏసురెడ్డి, కొంగర రవి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్,మండల ఉపాధ్యక్షులు కదుదూరి నరేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు మట్ట కిషన్ రెడ్డి,అనంతుల రాజులు పలువురున్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చెన్నూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వాఖ్యలపై మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం పిర్యాదు చేశారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిని పక్కదారి పట్టించడానికి కేసీఆర్ యత్నంలో భాగమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బాల్క సుమన్ అనుచిత వాఖ్యలు చేయడమని మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులు ఖండించారు.

మాసాయిపేటలో ఆటో డ్రైవర్ల ఆందోళన



నవతెలంగాణ-వెల్దుర్తి

కాంగ్రెస్ ప్రభుత్వం సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ ఆటో కార్మికుల పొట్ట కొట్టారని మండిపడుతూ మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు ఆందోళనకు దిగారు. గత రెండు రోజుల క్రితం ఆటో డ్రైవర్ ఆర్థికంగా కృంగిపోయి చేసేదేమి లేక ఆకలి చావుతో చనిపోయినా పట్టించుకున్న నాయకుడే లేరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందిస్తూ ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటోలో మీటర్‌ను ఏర్పాటు చేసి, మీటర్ ద్వారా ఎంత బిల్లు వస్తుందో అది మాకు చెల్లిస్తే ఆటోలలో మహిళలను తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. లేని ఎడల రూ.15 వేల జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆటో డ్రైవర్లు వ్యతిరేకం కాదని, తమ పొట్ట కొట్టొద్దని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉజ్వల పథకం కింద మహిళలకు ఫ్రీ గ్యాస్ పంపిణీ

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం లోని నందారం గ్రామ పరిధిలో ఉన్న ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ పచ్చిమట్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం 27 మంది మహిళలకు ఉజ్వల యోజన పథకం కింద మంజూరైన ఉచిత గ్యాస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు వీరాచారి హాజరై గ్యాస్ స్టవ్, సిలిండర్ మహిళలకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రతీ కుటుంబానికి గ్యాస్ కనెక్షన్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఎంతో మంది గ్యాస్ కనెక్షన్లు పొంది ఆనందంగా వంటలు చేసుకుంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రామంచ మహేందర్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ వేణు గోపాల్ రావు, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, పట్టణ ఉపాధ్యక్షులు గాదాసు రాంప్రసాద్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు పోలోజు రాజేందర్, మండల కార్యదర్శి రాకేష్ రెడ్డి, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు బానోతు అనిల్ కుమార్, బూత్ అధ్యక్షులు శీరం రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్న బీరయ్య యాదవ్

నవ తెలంగాణ-దుబ్బాక



జాతీయ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బీరయ్య యాదవ్ మంగళవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని రేకులకుంట మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బీసీ సమస్యలపై, తెలంగాణ ఉద్యమంలోనూ పోరాటం చేశానని ఉద్యమంలో ఎన్నో కేసులు,జైలు జీవితం అనుభవించానన్నారు. తన సేవలను గుర్తించి పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్ తనకు మెదక్ ఎంపీ టికెట్‌ను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం యాదవ సమాజం సభ్యులు బీరయ్య యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు ఉస్మాన్, టీజేఏసీ జిల్లా చైర్మన్ సత్తయ్య యాదవ్, అల్లాపూర్ మాజీ సర్పంచ్ నారాయణ,టిఆర్ఎస్వి నాయకుడు అఖిల్,కెసిఆర్ యువసేన సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ అంజద్,మాజీ సర్పంచ్ పర్వతాలు యాదవ్,నాయకులు దండబోయిన రాజు యాదవ్,పర్వతాలు యాదవ్ తదితరులున్నారు.

మోగిపురుగు నివారణకు చర్యలు

నవతెలంగాణ-గజ్వేల్



మోగి పురుగుల ఉధృతి ఉన్నచో ఫోర్ జి కార్టీఫ్ హైడ్రో క్లోరైడ్లు గుళికలను వాడాలని గజ్వేల్ ఏ డి ఏ బాబు నాయక్ తెలిపారు. మంగళవారం గజ్వేల్ మండలం దాచారం, బయ్యారం, క్యాసారం తదితర గ్రామాల్లో వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్లో వరి పంట పీలక దశలో ఉందన్నారు. వరి పంటకు మోగి పురుగు సల్ఫండ్ ధాత్ర వలన వరి నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. వరి వేరులలు కుళ్లిపోయి పిలకలు మాడినట్లు ఎండినట్లు లక్షణాలు గమనించవచ్చు అన్నారు. ఇది చౌడు నెలలో ఎక్కువగా ఉంటుందని నివారణకు వరి పొలాల్లో నీటిని పూర్తిగా తీసివేసి పొలాన్ని ఆరబెట్టాలన్నారు. తడి పొడి పద్ధతిలో నీటి తడులు వేసుకోవాలన్నారు. హైడ్రో క్లోరిక్ మందును 05 మి.లీ మందును లీటర్ నీటికి కలిపి ఎకరాకు మొత్తం 200 లీటర్ల ద్రవ్యాన్ని సుమారుగా 8 నుండి 10 పంపులు పిచికారి చేయాలన్నారు.

పట్టపగలు తిమ్మారెడ్డిపల్లిలో చోరీ

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లిలో మంగళవారం పట్ట పగలు చోరీ జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు గ్రామస్తుల సమాచారం మేరకు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చిలుముల కొండల్ ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడి వస్తువులను చిందర వందర చేశారు. ఇంట్లో ఉన్న రూ. 3లక్షల నగదును అపహరించారు. కుకునూరు పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఖబర్దార్ బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకో



నవ తెలంగాణ-గజ్వేల్ : ఖబర్దార్ బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకో అని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బాల్క సుమన్ కేసీఆర్ కుటుంబ మోచేతి నీళ్లు తాగి, కేసీఆర్ కుటుంబానికి బానిసగా వ్యహరిస్తున్నారన్నారు. సొంత నియోజకవర్గం చెన్నూర్‌లోనే ప్రజలు తగిన బుద్ధి చెప్పినా అధికార మదం పోలేదన్నారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. స్థాయిని మరచి మాట్లాడుతున్నావన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, యన్‌యస్‌యూఐ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో తిరగనివ్వరని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కొత్తపల్లి బాలగౌడ్, కొడకండ్ల బాలు తదితరులు ఉన్నారు.